# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకట రత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 34 సంచిక 12
పేజీలు 40
ఆగస్ట్ 2015

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ................................. ....... పేజీ**

భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ................................3
అమ్మమాట..........................................................5
గోదావరీ నది పుష్కరాలు..........................7
బంగారు క్షణాలు ................................9
సన్నిధిలో సంభాషణ ............................11
యోగవాశిష్ఠము ................................13
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................15
పరిప్రశ్నేన సేవయా ............................16
పుటకే పుణ్యమూ, బ్రతుకే ధన్యమూ............. 17
గీతాధ్యయనమ్.................................18
శ్రీకృష్ణకర్ణామృతము.............................20
సంక్షేమ కార్యక్రమాలు..........................22
అమృతబిన్దూపనిషత్ ..........................23
మహాభారత నీతి చంద్రిక.....................24
శివకేశవ సమత్వము...........................26
ప్రబోధము.......................................28
తల్లికృప త్వరగా లభిస్తుంది....................30
సత్సంగామృతం.................................32
ఆషాఢ పూర్ణిమ విశిష్ఠత ........ ..............34
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........36
విజయవాడలో సత్సంగ సమావేశములు....37
సర్వజ్ఞశేఖర సద్గురునాధులు ................38
విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి ।
సర్వభూతేషు చాత్మానమ్ తతోన విజుగుప్సతే ॥

'నేను ఉన్నాను' అనేది కేవలం విచారణలో మాత్రమేకాక, ఆచరణపరంగా అనుభవ పూర్వకంగా పొందవలసిన జ్ఞానం. అదే జీవుడు సాధించ వలసిన జ్ఞానం. అదే జీవుడు సాధించవలసిన ఏకైక ధ్యేయం. లౌకిక దృష్టిలో ఆత్మవస్తువు జగత్తుకు భిన్నంగా గోచరించటమే అసత్యం. జగత్తులో జీవులంతా భిన్నరూపాలలో ప్రకాశిస్తున్నా, ఇంద్రియాలైనా వివిధ ఉపాధులైనా ఏ భావాలైనా, వాటన్నిటికి ఆధారమైనది 'నేను ఉన్నాను' అన్న నిజ ఆత్మానుభూతే సుమా.

మానవుడు ఆచరణ లోపం చేతనే ఆత్మ వస్తువు అపరిచ్ఛిన్నమైనా పరిచ్ఛిన్నమైనదిగా భావన చేస్తున్నాడు. నిజ ఆత్మానుభూతిపై ఆరోపణ చేయబడనిది జగత్తులో లేదు. 'నేను వున్నాను' అనే నిజ ఆత్మానుభూతి దృఢమైన కొలది జీవుడు తన దేహభావనగాని, హోదా గురించిగాని ఇంద్రియ వ్యవహారముల యందు కాని సుఖదుఃఖాలు అభిమాన అహంకారము అనే ద్వందములకు గాని చలించడు.

అదే జీవదృష్టి లేక జీవభావాన్ని కోల్పోవటం అంటే. అదే నిజఆత్మానుభూతి. సర్వత్రా వ్యాప్తమై ఇచ్ఛాశక్తిగా, జ్ఞానశక్తిగా, క్రియాశక్తిగా, జడశక్తిగా ఏ విధంగానైనా ప్రకాశించేది ఆత్మశక్తి మాత్రమే అనేది అనుభవపూర్వకంగా తెలుసుకోవాలనేదే ఉపనిషత్ ఆంతర్యము.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "మానవుల స్వభావాలు అనేక రకాలుగా ఉంటాయి. 'భగవంతుడు ఉన్నాడా! మాకు చూపించండి' అనేవారు కొంతమంది; 'భగవంతుడు మానవాకారంలో ఉంటాడా?' అని మహాత్ములని విమర్శించేవారు మరికొంతమంది. 'భగవంతుడు ఎక్కడ ఉన్నాడు. అంతా మానవుడు తన స్వశక్తి మీదనే ఆధారపడి జీవిస్తున్నాడు. ప్రజ్ఞ అంతా మానవునిదే తన స్వశక్తితో ఎన్నో పరిశోధనలు చేసి కనుగొన గల్గుతున్నాడు. మానవుడు తన జీవితకాలం పూర్తి అయిన తరువాత మరణిస్తున్నాడు తిరిగి జన్మిస్తున్నాడు అంటే మేము నమ్మము అనేవారూ' ఉన్నారు" అన్నారు.



శ్రీబాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "అదే అజ్ఞానమంటే. మానవుని మనస్సు జన్మాంతర వాసనలతో కూడి అటువంటి భావాలు కల్గుతాయి. భగవానుడికి పెద్ద చిక్కు వచ్చిపడింది. రూపనామ క్రియారహితంగా ఉండే కనపడని భగవంతుడిని గూర్చి ఎందుకు చింతించాలి? అంటారు. పోని ఒక రూపం ధరించి సగుణ బ్రహ్మగా అవతరించి వస్తే ఆయన కూడా మనవలెనే మానవాకారంలో ఉన్నాడు. ఆయనకి రెండు చేతులురెండు కాళ్ళు ఉన్నాయి. మనలాగానే భోజనం చేస్తారు. ఆయన భగవంతుడు అంటే ఎలా నమ్మటం? అంటారు.

ఇటువంటి అజ్ఞానాంధకారంలో ఉన్న మానవులను ఉద్ధరించటానికి దయామయుడైన భగవానుడు మహాత్ముల రూపంలో అవతరించి మానవులకి జ్ఞానబోధ చేస్తుంటే దానిని పెడచెవిన పెట్టి సంస్కారహీనులై సంసార సాగరంలో మునిగి తేలుతూ సుఖము కల్గితే ఆనందిస్తున్నారు. కష్టము కల్గితే దుఃఖిస్తున్నారు. ఎటువంటి మానవుడైనా కష్టము కల్గినపుడు తప్పక భగవంతుడిని ఆశ్రయించక తప్పదు. దానిని అవసరార్థ భక్తి అంటారు. ఇక్కడ మీకొక ఉదంతం చెప్తాను. గుంటూరు నుండి ఎవరో ఒక లెక్చరర్ నా దర్శనార్థం వచ్చాడు. ఎవరో జ్యోతిష్కుడు

ఆయనకి 'చాల చెడ్డరోజులు గ్రహస్థితి బాగాలేదు. జాగ్రత్తగ ఉండ'మని హెచ్చరించాడట. ఆ విషయం నా వద్ద ప్రస్తావనకి తీసుకువచ్చి 'ఇది నమ్మదగినదేనా?' అని అడిగాడు ఆ వ్యక్తి.

భగవంతుడిని విశ్వసించనివాడు ఇంక గురుమూర్తిని ఏం నమ్ముతాడు? మానవాకారంలో భగవంతుడా నాన్సెన్స్ అనే స్వభావం. అటువంటి వ్యక్తికి నేను ఏ రకమైన దీక్ష యిచ్చి రక్షిద్దామని ప్రయత్నించినా చేస్తాడని నమ్మకం లేదు. అందువలన విధి నిర్ణయం ఎవరూ తప్పించలేరు భగన్నామము చేసుకుంటూ జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరించాను. ఆయన పాపం చాలా జాగ్రత్తగానే ఉన్నాడు. ప్రజ్ఞ తనది అనే అహంకారముతో ఉన్నాడు. భగవన్నామము చేస్తాడా! ఆ సంస్కారము చేయనీయదు. కొడుకులు, కోడళ్ళు మనవళ్ళతో ఇంట్లోనే జాగ్రత్తగా కాలక్షేపం చేస్తున్నాడు.

ఒకనాటి సాయం సమయం మనవడు ఆడుకుంటూ ఆడుకుంటూ రోడ్డుమీదికి వెళ్ళాడు. తాతగారు పరాకుగా ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే కంగారుగా రోడ్డుమీదికి పరుగు పరుగున వెళ్ళి మనవడి మీద మమకారంతో ఇంతటి ప్రజ్ఞావంతుడు తన కాలికి పంచ అడ్డుపడి క్రిందపడ్డాడు కాలి విరిగింది. మనవడు క్షేమంగానే ఉన్నాడు. మనవడికి మనస్సు లేదుగా భగవంతుడు రక్షించాడు చూశారా!

కాలు విరిగినవాడు హాస్పిటల్‌కు వెళ్ళక తప్పదు కదా! హాస్పిటల్‌లో బాధ కల్గినప్పడైనా భగవంతుడిని స్మరించకుండా ఉండగల్గుతాడా! కాలు విరిగి కట్టు కట్టించుకొన్న తర్వాత మళ్ళీ నా దర్శనానికి వచ్చాడు. ఇప్పటికైనా భగవంతుడు ఉన్నాడని విశ్వసించు. నీ కాలుకి వచ్చిన ప్రమాదం ఏమిలేదు అని చెప్పాను.

అందువలననే ఆశ్రమంలో నా శక్తినంతా ధారపోసి దేవతా మూర్తులను ప్రతిష్ఠ చేసాను. ప్రాపంచిక వాంఛలతో ఉన్నవారికి విశ్వాసంతో దేవతామూర్తులను ఆశ్రయిస్తే తప్పక వారి కోర్కెలు నెరవేరుతాయి. ఆశ్రమాన్ని నమ్ముకొని విశ్వాసంతో జీవించేవారికి ఏ లోటు ఉండదు. కాబట్టి భగవంతుడు ఉన్నాడని విశ్వసించు. భజించు, ధ్యానించు నీకు ఏ లోటూ కలగదని మీ హృదయబాబు హెచ్చరిస్తున్నాడు."

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

## 'అవ్యక్తమ్ వ్యక్తిమాపన్నమ్'

సనకాది ఋషులు, దక్షిణామూర్తి స్వామిని 'శుద్ధ జ్ఞానైక మూర్తయే' అని స్తుతించారు. మనం గురుమూర్తిని అలా చూడ గలుగుతున్నామా? 'నాకు మా గురువుగారు లడ్డూ పెట్టారు; నా వీపు తట్టారు; మాట్లాడారు' అనే మాట్లాడుతున్నారు. గురుమూర్తిని ఒక వ్యక్తిగానే చూస్తే, శతకోటి కల్పాంతరాలైనా, గురుతత్వం అర్థం కాదు. 'మేము ఇంతింత సాధనలు చేసిన ఋషులం. ఆయనేమో యువకుడు. ఆయన మాకేం బోధిస్తాడు!' అని ఆ వృద్ధ శిష్యులు అనుకోలేదు. ఆయన 'స్త్రీయా, పురుషుడా, చిన్నవాడా, పెద్దవాడా, గడ్డాలున్నాయా, లేదా' - ఇవేవీ వారు చూడలేదు. జ్ఞానానందంతో ప్రకాశిస్తున్న ఆ దక్షిణామూర్తి స్వామి యొక్క ప్రశాంతమైన, నిర్మలమైన, చిరు దరహాసంతో అలరారుతున్న ముఖారవిందం చూసి ఆనందస్వాంత భరితులైనారు. వారు కేవలం అవ్యక్తాన్నే దర్శించారు.

శ్రీ గురుదేవులు కూడా మాయ శరీరాన్నే తీసుకుని వచ్చారు. కానీ వారు శ్రీమద్భగవద్గీతలో చెప్పినట్లు 'ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః' అని మరియు 'ప్రకృతిం స్వామధిష్ఠాయ - సంభవామి ఆత్మ మాయయా' అని ప్రకృతిని తాము అధిష్ఠించి, శరీరధారులై మన ముందుకు వస్తున్నారు. మనము మాయకు లోబడి, కర్మానుసారంగా అవిద్యోపాధిని ధరించి వస్తున్నాము. అందుకనే గీతలో భగవానుడు "అర్జునా! నీకూ, నాకూ కూడా ఎన్నో జన్మలు గడచినవి. కానీ నా జన్మలు దివ్య జన్మలు; నాకు నీ జన్మల గురించీ తెలుసు, నా జన్మల గురించీ తెలుసు' అని శెలవిచ్చారు. అయనని 'వ్యక్తావ్యక్తౖ స్వరూపాయ' అని కీర్తించారు ఋషులు.

అవ్యక్తం వ్యక్తిమాపన్నమ్ । మన్యంతే మామబుద్ధయః ।
పరం భావమజానంతః । మమావ్యయ మనుత్తమమ్ ॥
(భ.గీత 7/24)

అని భగవానుడు నిష్కర్షగా చెప్పినాడు.

'అబుద్ధులు అంటే బుద్ధి లేనివారు లేక విచక్షణా జ్ఞానం లేని మూర్ఖులు, అవ్యక్తమైన నా తత్వాన్ని గుర్తించక, నన్ను ఒక వ్యక్తిగానే

పరిగణిస్తారు. వారి యొక్క సంకుచిత జ్ఞానంతో నా దివ్యతత్వాన్ని వారెరుగరు' అని స్వామి చెప్పారు.

అవ్యక్త, నిర్గుణ పరమాత్మ తత్త్వం జీవకోటిని ఉద్ధరించటానికి ఒక దివ్యరూపం దాల్చి వ్యక్తమయింది. మనకోసం మెట్లు దిగి క్రిందకి వచ్చారు. కాని వారి స్వరూపం ఎప్పుడూ అవ్యక్తమే. ఒక వ్యక్తి రూపాన్ని దాల్చి వచ్చేసరికి, వ్యవహారము, వ్యవస్థ ఏర్పడుతున్నాయి. అంతమాత్రాన దానిలో మునిగిపోకూడదు. సాధన భంగం కాకుండా దానిని జాగ్రత్తగా వుపయోగించుకోవాలి. అదే అవతారపురుషులు మనకు నేర్పిస్తారు. పంచభూతాలనే వారు కూడా తీసుకుని వచ్చారు. కాని వాటిచేత వారు బంధింపబడరు. 'సాకారం' ఎప్పుడూ మార్పు కలిగివున్నదనిగుర్తించాలి.

మనమాశ్రయించిన గురుదేవులు ఎట్టివారు? కేవలం శుద్ధ జ్ఞానైక మూర్తులు. మనం ఎలా చూస్తే అలా కనిపిస్తారు. వారు కేవలం ఒక అద్దంలో ప్రతిబింబంలాంటివారు. వారి ముందుకు మనం ఏ భావనతో వెళితే అలాగే దర్శనమిస్తారు. 'శుద్ధ జ్ఞానైక మూర్తయే' అన్నది అందుకోవటానికి చాలా లోతుకు వెళ్ళాలి. వారు నిర్మలులు, ప్రశాంతులు. అక్కడ మతాలు లేవు. వారి సన్నిధిలో కేవలం ప్రశాంతత మాత్రమే వున్నది. ప్రపంచంలో అంతా అశాంతే.

ఒక్కపూట బృందావనంలో వచ్చి కూర్చుంటే హాయిగా వుంటుంది. కాని, వెంటనే యిల్లు గుర్తుకు వస్తుంది. 'ఆరవేసిన బట్టలు తడిసి పోతాయోమో అనో, వంట చేసే వేళయిందనో' ఏవేవో గుర్తుకు వచ్చేసరికి అశాంతి మొదలయిపోతుంది. ఇప్పుడు 'ప్రశాంతత' ఎక్కడ వుంది? అది గుర్తించండి. మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి. ప్రశాంతత మీలోనే వుంది. అది గుర్తించండి. అశాంతి కూడా మీ మనసే సృష్టిస్తోంది. బయట నుండి రావటం లేదు. పూజ, అనుష్ఠానం అన్నీ ధ్యానంలోనివే. ధ్యానం అనేది మానసిక పూజ. నిద్ర లేచేసరికి రాత్రి వచ్చిన తలనొప్పి పోతుంది. అదెలా? నిద్రలో మనసు అణిగి వుంటుంది కనుక మీ మనసు శరీరం నుండి విడిపోతుంది. మనసు లేకపోతే నొప్పి తెలియదు కదా! అందుకనే డాక్టర్లు మనం ఏదైనా నొప్పి అని వారిదగ్గరకు వెళితే, ముందుగా మత్తు యింజక్షన్ యిచ్చి మనని నిద్రపోగొడతారు. మనకి తాత్కాలికంగా ఆ నొప్పి తగ్గినట్లు అవుతుంది. అప్పుడు వారు తాపీగా మన నొప్పిని గురించి ఆలోచిస్తారు!

- సశేషం

# గోదావరీ నది పుష్కరాలు

- రమణ ప్రసాద్

జులై 14 నుండి జులై 25 వరకు జరిగే గోదావరి పుష్కరాలు మహాపుష్కరాలుగా ఉత్తరదేశంలో జరిగే 'కుంభమేలా'లాగ పెద్ద ఎత్తున ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు నిర్వహిస్తున్నాయి. భారీ ఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. 2003లో జరిగిన పుష్కరాలలో రెండు కోట్లమందికి పైగా గోదావరినదిలో స్నానాలు చేశారు. పితృదేవతలకు అర్ఘ్యాలు అర్పించుకున్నారు.

గురు గ్రహం (బృహస్పతి) మేషం, వృషభం, మిథునం ..యిలా 12రాశులలో ప్రవేశిస్తాడు. బృహస్పతి ఏ రాశిలో ప్రవేశిస్తాడో, దానికి అనుగుణంగా ఆ నదిలో పుష్కరుడు ప్రవేశిస్తూ వుంటాడు. ఇలా గురుడు ప్రవేశించిన మొదటి 12రోజులు, ఆ సంవత్సరపు చివరి 12రోజులు పవిత్ర కాలంగా చెప్పారు. ఋషులు, పుష్కరుడు ప్రవేశించిన ఆ నదిలో సకల నదులు కూడా ప్రవేశిస్తాయి. ఈ 12 +12 రోజులూ స్నానం చేస్తే పుణ్యం లభిస్తుంది. ఎవరెంత భక్తి శ్రద్ధలతో స్నానం చేస్తే వారివారికి అంతంత పరిమాణంలో పాపాలు నశించి, పుణ్యం లభిస్తుంది.



ఇంతకీ పుష్కరుడు అంటే ఎవరు?

- తుండిలుడు అనే మహర్షి. లోకకళ్యాణం కోసం శివుని గురించి తపస్సు చేసి, ఆయనను మెప్పించాడు. శివుడు ప్రత్యక్షమై అతని కోరికమేరకు ఆయనను తనలో లీనం చేసుకున్నాడు. దానితో తుండిలునిలో జలశక్తి పెరగసాగింది. అతడే పుష్కరుడు. బ్రహ్మ శివుణ్ణి తాను చేసే సృష్టికార్యంలో సహాయం కోరకు పుష్కరుణ్ణి కోరాడు. పుష్కరునికి బ్రహ్మ అనుగ్రహశక్తి కూడా లభించింది.

ఇది గమనించిన బృహస్పతి బ్రహ్మను గురించి తపస్సుచేసి, మెప్పించి, పుష్కరుని తనకు సహాయంగా యిమ్మని కోరాడు. బ్రహ్మ

అనుమతించాడు. ఈ విధంగా శివానుగ్రహం, బ్రహ్మానుగ్రహం కలిగిన పుష్కరుడు గురువు ఏ రాశిలో వుంటే ఆ రాశికి అనుగుణంగా ఆ యా నదులలో వుండాలని నిశ్చయించుకున్నాడు.

స్నానం ఎలా చేయాలి? -

నాభిమాత్రే జలే స్థిత్వా శిఖాం విభజ్య ద్విధా తథా।
నిరుద్ధ కర్ణ నాసస్యః స్నాయా త్త్రిశ్చ స భార్యః॥

తన భార్యతో సహా బొడ్డు లోతు నీటిలో నిల్చుని, జడలను రెండు పాయలుగా చేసుకుని ముక్కు రంధ్రాలనీ, చెవి రంధ్రాలనీ బొటన వ్రేళ్లతో, మధ్య వ్రేళ్లతో మూసుకుని, మూడు మునకలు వేస్తూ, గోవిందనామ స్మరణ చేస్తూ స్నానం చేయాలి. స్నానానంతరం శ్రాద్ధ విధిని నిర్వహిస్తే పితృదేవతలు ఆనందించి వంశాభివృద్ధిని, సకల శుభాలను ప్రసాదిస్తారు.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2015

9-8-15 ఆదివారం, శ్రీగురుదశమి.

ఉదయం 11గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

29-8-15 శనివారం రాఖీ పూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, మహాప్రసాదం.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

సెప్టెంబర్ 2015

7 సోమవారం శ్రీగురుదశమి

సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

17 గురువారం వినాయక చవితి.

శ్రీగణపతిపూజ; శ్రీసద్గురుపాదపూజ, తీర్థ ప్రసాదాలు.

28 సోమవారం పూర్ణిమ

సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

"గురుమూర్తి ఉపదేశించిన మంత్రము యొక్క విలువ తెలియని మూర్ఖుడు 'ఇంతేనా! రోజూ వినే ఈ మూడు ముక్కలేనా?' అనుకుంటాడు. కానీ వాడికేం తెలుసు ఆ మూడు ముక్కలలో మూడు లోకాలనీ కూడా దగ్ధం చేయగలిగేటటువంటి అనంతశక్తి దాగి ఉందని? గురుమూర్తి స్వయంగా తన ముఖస్తుగా చెప్పిన మంత్రములో తన శక్తినంతా అందులో యిమిడ్చి దాని ద్వారా అనంతశక్తిని తన శిష్యుని లోనికి ప్రవేశపెడతాడు.

ఇప్పుడు మన శాస్త్రజ్ఞులు అణువులను, పరమాణువులను కూడా కనుక్కున్నారు. అన్ని వస్తువులలోనూ సూక్ష్మాతి సూక్ష్మమైనది పరమాణు వని గుర్తించారు. ఆ పరమాణువులలో ఎంత అనంతమైన శక్తి దాగి ఉందో తెలుసుకున్నారు. అతి సూక్ష్మమైన పరమాణువులో ప్రపంచం అంతటినీ ఒక్క క్షణంలో సర్వనాశనం చేయగలిగేటువంటి మహత్తర శక్తి ఉంది. యంత్ర యంత్రాంగాలనీ నడుపగలిగే శక్తి దానిలో ఉంది. మరి ఇంతటి మహత్తర శక్తి దాగిఉన్నది దేనిలో? ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాణువులో! దీనినే 'అణోరణీయాన్, మహతో మహీయాన్' అని మన వేదాలలో చెప్పారు.

అదే విధంగా గురుముఖతః వచ్చిన ఆ 'ముడు ముక్కల'లో, ఆ దివ్యమంత్రంలో, అంతకంటె మహోన్నతమైన శక్తి దాగి ఉన్నది. మానవుని యొక్క జన్మజన్మాంతర వాసనలను హరింపజేసి, మానవుడిని మాధవునిగా మార్చగలిగే శక్తి దానిలో ఉంది. గురులక్ష్యార్థమందు తదేక నిష్ఠ నిలిపి ధ్యానించినట్లయితే ఆత్మసాక్షాత్కారం లభిస్తుంది. ఈ సత్యం తెలుసుకున్నవాడు ధన్యుడు!

తేనెటీగ, మామూలు ఈగ - రెండూ చూడటానికి ఈగలే, కాని వాటి ప్రవృత్తిలో ఎంతో భేదం ఉంది. మామూలు ఈగ మలిన పదార్థాల మీద వ్రాలి, అంటురోగాలని వ్యాప్తం చేసి మనకి హాని, దుఃఖము కలుగ జేస్తుంది. తేనెటీగ పూలలోని మకరందాన్ని గ్రోలి, దానికి కావలసినంత అది తీసుకుని, మిగతా తేనెని తేనెపట్టులో భద్రపరచి, లోకానికి అందిస్తుంది.

అదే విధంగా దుర్జనుడు, మామూలు ఈగవంటి వాడు. అతడు నిరంతరం విషయముల యందే రమిస్తూ, దుష్టగుణాలు కలిగి ఉండి, సంఘానికి హాని చేకూరుస్తాడు. సజ్జనుడైన భక్తుడు తేనెటీగవంటి వాడు. అతడు ఎల్లప్పుడూ భగవద్భక్తి అనే మకరందాన్ని గ్రోలుతూ తాను తరించడమే కాక యితరులకు కూడా ఆనందాన్ని అందజేస్తాడు.

తామర పుష్పం వికసించగానే ఎక్కడినుంచో వచ్చిన తుమ్మెద, దానిలోని మకరందాన్ని గ్రోలి సంతోషంగా వెళ్లిపోతుంది. కానీ ఆ తామర పువ్వు క్రిందనే ఉన్న కప్ప ఆ మాధుర్యాన్ని తెలియలేక ఆ పూవు మీద గంతులు వేస్తుంది, మధువుని వదులుకుంటుంది.అలాగే భక్తుడు సద్గురువుని వెదుక్కుంటూ వచ్చి, గురుబోధామృతాన్ని గ్రోలి తరిస్తాడు. గురుబోధ యొక్క విలువని తెలియని మూర్ఖుడు పద్మం క్రింద కప్పలాగ గురుసాన్నిధ్యంలో ఉండి కూడా, 'ఇదంతా రోజూ వినేదేగా!' అనుకుని గురుబోధని వదులుకుంటాడు. తాను పొందవలసిన ఆనందాన్ని పొంద లేడు. అటువంటి మూర్ఖునికి ఏమి చెప్పినా కూడా ప్రయోజనం ఉండదు. వాడు దుఃఖం లేనటువంటి శాశ్వతానందాన్ని కనలేడు. వాడి బ్రతుకంతా 'కంతే'!

ఎంతటి చక్కటి తత్త్వాన్ని అందించావమ్మా శేషమ్మా! ఏది ఇంకొక పద్యం చదువు!" అన్నారు శ్రీబాబు.

-సశేషం



# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "ప్లగ్‌లో కరెంటు కనెక్షన్ లూజ్‌గా ఉంటే బల్బు వెలుగుతుందా? ఇది బాగా అర్థం అయ్యేలాగా మీకు కొన్ని ఉదాహరణలు చెప్తాను. మీరు లెక్చరర్స్ కదా! మీ క్లాసులో ఒక పిల్లవాడు ఒకరోజు క్లాసుకి రావటం మానేశాడనుకోండి, అది మీరు గమనించలేదనుకోండి, అప్పుడు ఆ పిల్లవాడు మీమీద ఆయన ఎప్పుడూ అంతే ఏమీ పట్టించుకోడు అని దుష్ప్రచారం చేశాడనుకోండి, మరి 'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః' అన్న శ్లోకానికి ముప్పు తెచ్చినట్లేగా? దానికి బాధ్యత ఎవరిది? అంతటితో ఆగుతుందా? ఆ పిల్లవాడు రోజూ క్లాసులు మానేసి సినిమాలకి వెళ్ళి పతనం అవుతాడుగా?



ఇంకొక ఉదాహరణ చెప్తాను. కొంతమంది ఉంటారు, 'పరమాత్ముడు సర్వవ్యాపకుడు కదా! ఆయనను దర్శించటానికి అక్కడి వరకూ వెళ్ళాలా? ఇక్కడే ఉండి ఒక నమస్కారం పెడితే చాలదా?' అని బద్ధకిస్తారు. 'సాధునాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం' అని అన్నారు. కాబట్టి అవకాశం ఉండీ బద్ధకిస్తే వాడిలో నీచభావాలు దుష్ట ఆలోచనలు చెలరేగి పతనం కాకతప్పదు.

నిజమైన భక్తుడు భగవంతుని వియోగాన్ని భరించ గలుగుతాడా? నిరంతరము అతని మనస్సు ఆ దివ్యచరణార విందముల యందే నిలుపుతాడు. నిజమైన భక్తుడు తాను నమ్మిన దైవానికి దాసానుదాసుడనుకుంటాడు. శివాజీ మహారాజు తన సర్వస్వాన్ని తన గురుదేవుడైన సమర్థ రామదాసుగారి దివ్యచరణారవిందాలకు సమర్పించాడు. కర్మలో అకర్మ చూశాడు. అదీ నిజమైన గురుభక్తి అంటే. అందువలననే శివాజీ మహారాజు ఈనాటికి ప్రకాశిస్తున్నాడు. కులశేఖరుడు కూడా మహారాజు అయి ఉండి కూడా తను నమ్మిన

దైవానికి దాసానుదాసుడననే భావించాడు. అందువలననే ఆయన రచించిన ముకుందమాలలో ప్రభువుని ప్రార్థిస్తూ "స్వామీ! నేను ఎన్ని జన్మలెత్తినా ఏ దేహము ధరించినా నీ దివ్యచరణారవిందములపై మనస్సు నిలిచి ఉంటే చాలు' అని కోరుకున్నాడు. అది నిజమైన భక్తి. అటువంటి భక్తి విశ్వాసములున్నవాడు త్యాగం చేయగలుగుతాడు.

విశ్వాసం లేనివాడు ఏం త్యాగం చేయగలుగుతాడు? త్యాగము చేయనిదే అమృతత్వానికి ఎగబ్రాగలేడు కదా! అంతేకాదు నిజమైన భక్తుడు తన భక్తిని ఎన్నడూ వెల్లడి చేయడు.

నా చిన్నతనంలో కొంతమంది శిష్యులు ఉండేవారు. మేము శివదర్శనం పొందామని, అమ్మను దర్శించామని, రామదర్శనం చేశామని చెప్పేవారు. నిజంగా పరమాత్ముని దర్శించినవారు అలా మాట్లాడతారా? వారు అలా మాట్లాడినా సమర్థ సద్గురువు నమ్ముతాడా? మెస్మరిజం చేసేవారిలో కూడా కొంతమంది మంచి సాధకులే. సాధనలో అష్టసిద్ధులకు దాసులై అలా ప్రవర్తిస్తారు. అటువంటి విద్యలవలన వారు తరించగలుగుతారా! వారు భ్రష్టులవటమే గాక వారిని నమ్ముకున్న వారిని గోతిలో పడవేస్తారు.

నిజమైన భక్తుడు రాజహంసలా పాలలో నీరు కలిపినా నీటిని వేరుచేసి పాలనే స్వీకరిస్తాడు. నిజమైన భక్తుని శ్రవణేంద్రియము ఆ పరమాత్ముని దివ్యనామాన్నే గ్రోలుతుంది. చక్షురింద్రియము ఆయన దివ్యరూపాన్నే దర్శిస్తుంది. మనస్సు ఆయన దివ్య చరణారవిందముల పైననే నిలిచిఉంటుంది.

అందువలననే భక్తి అనే నదిలో పయనిస్తే, నది సాగరాన్ని చేరినట్లు తప్పక శేషశయనుడిని చేరుకోగలుగుతావు. గురులక్ష్యార్థము నందు మనస్సు నిలిపిన నిజమైన భక్తునియందు కర్మ బీజాలను బియ్యంలో రాళ్ళు ఏరినట్లు ఆయనే ఏరివేస్తాడు. పేడని అగ్నికి దగ్ధం చేస్తే అది ఎలా శుద్ధిచెందుతుందో అలాగే నీలోని నీచత్వాన్ని తొలగించి జ్ఞానాన్ని అందిస్తాడు. ఇది మాత్రం సత్యం" అని అన్నారు.

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము - సుషుమ్నా ప్రసాద

వశిష్ఠమహర్షి రామచంద్రునితో యిలా సంభాషించారు "శ్రీరామా! మాయ భగవంతుని చేతనే సృజింపబడ్డది, అది చాలా శక్తివంతమైనది. దైవ కృప పొందిన వారే, మాయను జయించగలరు. భగవద్గీత విజ్ఞాన యోగంలో చెప్పబడినట్లు ......

'దైవీ హ్యేషా గుణమయీ, మమ మాయా దురత్యయా। మమేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే॥'



దైవముచేత సృజింపబడిన మాయను జయించటము దుష్కరము. కాని యెవరైతే తన శరణు పొందుతారో, వారు మాయను సులభంగా జయించగలరన్న గీతాచార్యుని సందేశము మనకు స్ఫురిస్తుంది.

"మాయ యొక్క ఘనతను, అపారమైన శక్తిని వర్ణింప సాధ్యము కాదు, మాయను జయించటము వలన, మానవుడు ఆత్మజ్ఞానము పొందవచ్చు, మనసు మాయ యొక్క బలమైన ఆయుధము, మనసు ద్వారా మాయా ప్రభావము గోచరిస్తుంది. మాయ యొక్క మరొక రూపమే మనసు, మనసును జయించటం వలన మాత్రమే, మాయను నిర్మూలం చేయగలము, జనన, మరణాలకు మరొక పేరు మాయ. గాధి కథను శ్రద్ధగా విను తద్వారా మాయ, దాని చాకచక్యపు పనులు, నీకు బాగా అవగతమవుతాయి రామా" యని మహర్షి చెప్పటం ప్రారంభించాడు.

"అరణ్యాలు, ఫలవృక్షాలతో అలరించే కోసలదేశమనే రాజ్యముండేది. అక్కడ విద్యా సంపన్నుడైన గాధియనే బ్రాహ్మణుడు నివసించేవాడు, అతను వేదాలన్నీ కూలంకుషంగా గ్రహించిన మేధావి, ఆయన సుగుణాలనిధి, ఆయన తన స్నేహితులను, బంధువులను వదలి, అరణ్యానికి తపస్సు చేసుకోటానికి వెళ్ళాడు. ఆయన శ్రీమహావిష్ణుమూర్తి దర్శనార్థమై, తటాకం మధ్య నీటిలో కంఠం వరకు మునిగి ఎనిమిది

నెలలు కఠోరమైన తపస్సు చేశాడు. గాధి తపస్సుకు మెచ్చి శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమయి, అతని తపస్సుకు ధ్యేయమేమిటని ప్రశ్నించాడు.

గాధి నదివొడ్డుకు వచ్చి, భగవాన్ శ్రీ మహావిష్ణుమూర్తికి సాష్టాంగ నమస్కారం చేసి యిలా సమాధానం చెప్పాడు, 'ఓ ప్రభూ! నీవు ముల్లోకములకు వరప్రదాతవు, నేను సచ్చిదానంద పరబ్రహ్మము నందు లయమవాలని నా కోరిక, దానికి నాందిగా నాకు మాయ యొక్క నిజస్వభావమును గురించి, దాని ప్రభావమును గురించి తెలుసుకోవాలని ఆసక్తిగా వున్నది.

వెంటనే శ్రీహరి యిలా అభయమిచ్చి, "నీవును ముందు మాయను ప్రత్యక్షంగా చూస్తావు, తరువాత, నీ భక్తి ద్వారా, మాయా ప్రభావము నుండి విముక్తుడవుతావు, వెంటనే మేఘావృతమైన నగరంలో శ్రీమహావిష్ణువు అదృశ్యమయినాడు.

గాధి శ్రీమన్నారాయణుని దర్శనము లభించినందుకు సంతసించాడు, ప్రభువుతో అనుబంధమేర్పడినందుకు, గాధి హృదయం పరవశించింది. అతను కొన్ని రోజులు అరణ్యాలలో గడిపాడు ఒక రోజు తటాకములో స్నానము చేస్తుండగా శ్రీహరి మాటల గురించే ఆలోచించాడు, వెంటనే మాయా ప్రభావము మొదలైంది.

- సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2015

9 ఆదివారం శ్రీగురుదశమి. రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

సెప్టెంబర్ 2015

5 శనివారం శ్రీకృష్ణాష్టమి రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

7 సోమవారం శ్రీగురుదశమి రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

వివరాలకు : శ్రీ నరసింహారావు సెల్ - 94912 22652

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఆగస్టు 2015

9 ఆది : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

12 బుధ : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

14 శుక్ర : అమావాస్య

15 శని : భారత స్వాతంత్ర్య దినము

28 శుక్ర : శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం.

29 శని : రాఖీ పూర్ణిమ, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

సెప్టెంబర్ 2015

5 శని : టీచర్స్‌డే; శ్రీకృష్ణాష్టమి - ఉదయం కలశస్థాపన, శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన, భక్తసమారాధన, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

6 ఆది : ఉదయం 11గం. శ్రీరాధాకృష్ణుల సామూహిక పూజలు, భక్తసమారాధన

7 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు ఉట్టికొట్టటం.

11 శుక్ర : మాసశివరాత్రి. పావులూరు బ్రాంచిలో ఏకాహం.

13 శని : అమావాస్య

17 గురువారం శ్రీ వినాయక చవితి

తె॥జా 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; ఉదయం 11గం. సామూహిక గణపతిపూజలు; భక్తసమారాధన

28 సోమవారం పూర్ణిమ

ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

సాధకులంతా విషయాదులు అంటే తినటం, త్రాగటం, నిదురించటం అని భావించటం తగదు. ధనార్జన కూడా తప్పులేదు. విషయాదులంటే మనస్సుతో చేసే భావన, చింతన, మనస్సులో జనించిన సంకల్పముల ద్వారా నిర్వహించే క్రియలు. మనస్సులో జనించే దోషపూరితమైన భావాలు వాటి ద్వారా వక్ర మార్గంలో ప్రవర్తించటం



విషయాదులు అనిపించుకుంటాయి. మనస్సు నిర్విషయ మవ్వాలి. దేహానికి సంబంధం లేదు. దేహము జడం. బాహ్యజగత్తు మనస్సు నిర్విషయ మవ్వటానికి తోడ్పడటం లేదు అన్నది తప్పు. మనస్సుని సంస్కరించటానికి శ్రవణము, మననము, విచారణ తప్పక తోడ్పతాయి. అయితే మనస్సు అనేది మాయ.

మనస్సు అనే మాయ సాధకుని రెండు రూపాలలో వ్యథకి గురిచేస్తుంది. ప్రథమంగా ఆచ్ఛాదన లేక ఆవరణ రూపంలో ఇబ్బంది పెడుతుంది. సాధకులంతా భావించినట్లు ఉపాధి ఆచ్ఛాదన కాదు. దేహ భావన మాత్రమే ఆచ్ఛాదన. అదే ఆవరణ. దాని నుండి బయటపడటం దుర్లభమే. అలాగే మాయ అనేది భ్రమణ రూపంగా కూడా ఇబ్బందికి గురిచేయవచ్చు. భ్రమణము అంటే మనస్సు విచ్చల విడిగా సంచరిచటం. బాహ్యాముఖంగా విషయాదులచుట్టూ పరిభ్రమించటం అదే విక్షేపం అంటే. ఈ రెండు స్థితుల నుండి బయట పడే మార్గము గురుబోధా శ్రవణము, మననము, విచారణ.

సద్గురుదేవులు తరచుగా భక్తులను హెచ్చరిస్తూ 'మీరు మధురాన్ని గ్రోలుతున్నారు కాని ఆ మధుర పదార్థ రూపాన్ని పొందటం లేదు' అనేవారు. అంతేకాదు. పంచదార నీటిలో కలిపితే నీరు మధురమై పానకం అవుతుంది. అంతేకాని పంచదార రూపం పొందటం లేదు. కాని దానిని అగ్నికి దగ్ధం చేస్తే నీరు ఆవిరియై పంచదారగా మిగులుతుంది. జ్ఞానాగ్నితో మనస్సులో మాలిన్యాలని దగ్ధం చేసుకుని శుద్ధ మనస్కులవ్వాలన్నది శ్రీసద్గురుదేవుల ఆకాంక్ష.

# పుటకే పుణ్యమూ, బ్రతుకే ధన్యమూ

- పెనుమాక నాగేశ్వరరావు

పుటకే పుణ్యమూ బ్రతుకే ధన్యమూ
గురువే దైవమనే భావనుంటే ।పుటకే।

గంగిగోవుపాలు చాలు గరిటడైన, ఫలము ఏమి ఖరము పాలు కడివడున్నా
శ్రీగురు దీవినే తోడై ఉండగా ప్రతిరోజూ పండుగే మనకిలా ।పుటకే।

పదము సోకి శిలలు కూడా పడతులాయే
గిరులు కూడా జలము పైన తేలియాడే
ఆ పద ధూళులే శిరమున దాల్చగా
మనసే సత్యముగా, స్వచ్ఛముగా మారిపోదా ।పుటకే।

స్మరణ చేసి ముక్తి పొందే గోప కాంతలూ
శరణుజొచ్చి అభయమొందె మౌన యోగులూ
వరములొంది ధన్యులాయే పుణ్య జీవులు
సద్గురు దీవెనే ప్రియ భావనగా మదిలో నిలిచిపోగా ।పుటకే।



(గత సంచిక తరువాయి) **గీతాధ్యయనమ్** - రమణ ప్రసాద్

ఈ విధంగా కర్మషట్కం ముగించి, భగవానుడు భక్తిషట్కం ప్రారంభించాడు.

**విజ్ఞాన యోగము**

భగవానుడు ముముక్షువు కలిగి ఉండవలసిన స్వానుభవ యుక్తమైన పరమార్థ జ్ఞానమును తెలుపుతూ పరమాత్మ యొక్క అస్తిత్వమును, దేవతలను గూర్చిన ఉపాసనా విషయములను ప్రతిపాదించు చున్నాడు. పరమాత్మయందు లగ్నమైన చిత్తమును కలిగి శ్రద్ధతో భజించేవాడు సర్వశ్రేష్ఠుడు. కాని పరమాత్మ స్వభావ స్వరూపములను తెలుసుకుంటే భగవద్ధ్యాన మందు ఏకాగ్రత సాధ్యమవుతుంది.



మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥ 3

ఎన్నో వేలమందిలో ఏ ఒక్కడో యోగ సిద్ధి కోసం ప్రయత్నిస్తాడు. వారిలో కూడా నన్ను నిజంగా తెలుసుకున్నవాడు ఏ ఒక్కడో ఉంటాడు. నా మాయా శక్తి ఎనిమిది విధాలుగా ఉంటుంది - భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం. ఇవన్నీ కలసి 'అపర ప్రకృతి' అనబడుతుంది. ఈ జగత్తును ధరించే మరో ప్రకృతి ఉంది. అదే 'పరా ప్రకృతి' అని పిలవబడుతుంది.

అపరా ప్రకృతి, పరా ప్రకృతి అంటే ఏమిటో ఒక దృష్టాంతం ద్వారా తెలుసుకుందాం. ఒక కుండ దానిలో నీరు, ఆ నీటిలో సూర్యుడు ప్రతి బింబిస్తున్నాడు అనుకుందాం. అలాగే మన దేహం (కుండ); మనస్సు నీరు; సూర్య ప్రతిబింబం జీవుడు చిదాభాసుడు. సూర్యుడు పరమాత్మ. ఘటము దేహము, జలము మనస్సు - అపరా ప్రకృతి. సూర్య ప్రతిబింబం (జీవుడు) పరాప్రకృతి. వీటికంటె విలక్షణుడు సూర్యుడు (పరమాత్మ).

ఈ రెండు ప్రకృతిల వల్లనే సమస్త భూతాలు ఆవిర్భవిస్తున్నాయి. ఈ జగత్తు ఆవిర్భవించడానికి, అంతం కావడానికి కారణం నేనే. నా కంటె ఇతరమైనది ఏదీ లేదు.

మత్తః పరతరం నాన్యత్ కించదస్తి ధనంజయ! ।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ 7

ఏ విధంగా దారం మణులను హారంగా కలుపుతుందో, అదే విధంగా నేను ఈ సమస్త జగత్తును ధరిస్తున్నాను. నేనే నీటిలో రుచిగా, సూర్య చంద్రులలో కాంతిగా, వేదాలలో ఓంకారంగా, ఆకాశంలో శబ్దంగా, నరులలో పౌరుషంగా ఉన్నాను. నేలలోని సుగంధం, నిప్పులోని తేజస్సు, సర్వభూతాలలోని ఆయుస్సు, తపోధనులలోని తపస్సును నేనే. సాత్త్విక, రాజసిక, తామసిక భావాలు నా వలనే కలుగుతాయి. వాటిలో నేను లేను, నాలో అవి ఉన్నాయి. ఈ త్రిగుణాల ప్రభావం చేత ఈ జగత్తు భ్రమ చెంది నన్ను వినాశం లేనివాడిగా గ్రహించలేక పోతున్నది.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే ॥ 14

త్రిగుణ రూపమైన నా దైవమాయను దాటటం సామాన్యులకు సాధ్యం కాదు. అయితే నన్నే ఆశ్రయించినవారు మాయను అతిక్రమిస్తారు.

నన్ను సేవించేవారు నాలుగు విధాలు : ఆపదలో ఉన్నవారు; ఆత్మతత్త్వం తెలిసికొనగోరేవారు; సిరిసంపదలు కోరేవారు; ఆత్మజ్ఞానం కలవారు. ఈ నలుగురిలో భగవంతుణ్ణి భక్తితో భజించే జ్ఞాని ఉత్తముడు. అతడు ఆత్మ స్వరూపుడు. 'వాసుదేవ స్సర్వమితి' - ఈ సర్వము వాసుదేవ మయం అనే జ్ఞానం కలిగి ఉంటాడు. కాని అలాంటి మహానుభావులు లోకంలో చాలా అరుదుగా ఉంటారు. ఏ భక్తుడు ఏ దేవతను పూజించినా అతనికి నేను ఆ దేవతా మూర్తి పట్ల శ్రద్ధను కలిగిస్తాను.

అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః ।
పరంభావ మజానంతః మమావ్యయ మనుత్తమమ్ ॥ 24

అవివేకులు నా సర్వోత్తమమైన నా రూపాన్ని గుర్తించలేక నన్ను మానవమాత్రుడిగా తలుస్తారు.

సాధిభూతాధి దైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।
ప్రయాణకాలే పి ఉ_చ మాం తే విదుర్యుక్త చేతనః ॥ 30

అదిభూతము, అదిదైవము, అదియజ్ఞాలతో కూడిన నా రూపాన్ని తెలుసుకున్నవారు మరణకాలంలో 'సమస్తమూ ఆ బ్రహ్మమే; ఆ బ్రహ్మమే నేను' అనే ఎరుకలో ఉంటారు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

దొడ్లో నుంచి ఆవు 'అంబా!' అని అనేసరికి గుర్తొచ్చింది దానికి మేత తీసుకురాలేదని. లేచి, ఆవును బయటకు తోలుకెళ్ళింది. చాలా ఆవులు పొలాలవైపు సాగిపోతూ కనిపించాయి. పూర్ణ కూడా వాటితో పాటు కలిసిపోయింది. ఆ గోవుల వెనుక గోప వేషధారి అయిన చిన్నారి కన్నయ్య సాగిపోతూ కనిపించాడు. ఆ ముగ్ధ మనోహర రూపం చూసే సరికి పూర్ణకు ఒళ్ళు తెలియలేదు. చుక్కల్లో చంద్రునిలా వెలిగిపోతున్న ఆ చిన్నారిని మిగతా గోప బాలురంతా 'కన్నయ్యా! కృష్ణా! అన్నా!' అంటూ పిలుస్తూ ముందుకు సాగిపోతున్నారు.



చేతిలో కఱ్ఱ పుచ్చుకుని, నెత్తిమీద నెమలి ఫించంతో అతి సుందర రూపంతో..... ఆ రోజు తనను చెట్టు మీద నుండి క్రింద పడకుండా కాపాడిన ఆపద్బాంధవుడేనా! ఈ చిన్నారి కన్నయ్య! అని ఆలోచిస్తూనే ఉన్నది పూర్ణ.

మధురకు వెళ్ళే సమయం అయిపోయింది. పూర్ణ తన పాలు, పెరుగు కడవలను చెట్టు నీడన కూర్చుని చద్దిమూటలు విప్పుతున్న గోప బాలుర దగ్గరకు తీసుకువెళ్ళింది. అందులో ఒకరిద్దరు ఎరిగిన పిల్లలు తనను 'పూర్ణక్కా!' అని పిలిచేసరికి కన్నయ్య తలతిప్పి వెనక్కి చూశాడు.

'ఓ నువ్వా! రా! రా! ఈరోజు ఇక్కడకు వస్తావని నాకు తెలుసులే. ఈ ముద్ద తీసుకో' అంటూ పూర్ణకిచ్చాడు కన్నయ్య. ఆ దివ్యబాలుని స్పర్శతో మధురమైన పెరుగన్నం ముద్ద చేతిలో నుండి నోటికి అందేసరికి ఒళ్ళంతా వెయ్యి మెరుపులు మెరిసినట్లయింది పూర్ణకి. పూర్ణ ఇచ్చిన పాలు, పెరుగు కన్నయ్య అందరికీ సమానంగా పంచిపెట్టేశాడు. సాయంత్రం గోపాలుడు, గోపబాలురు, తన గోవులతో కలిసి ఇంటికి వచ్చింది పూర్ణ. ఇహ ఒళ్ళు ప్రపంచం ఏమీ తెలియటం లేదు. కొంతకాలం గడిచింది.

మళ్ళీ ఎప్పుడు తెల్లవారుతుంది! ఎప్పుడు గోపాలుడి దర్శనం అవుతుంది! అని మధురమైన ఆలోచనలు మనస్సులో మెదలుతుండగా ఒకనాడు గోవిందుడు దగ్గరగా వచ్చి "నేను నీకు కనబడకుండా పోతే

నీవు ఏం చేస్తావు?" అని అడిగాడు పూర్ణని. ఊహించిని ఈ ప్రశ్నకు పూర్ణ బెంబేలు పడిపోయి 'కృష్ణా! ఇంతవరుకు నేను ఎరుగనది ఇటువంటిది కూడా ఉందా' అని అడిగింది.

"నేను నిన్ను పడిపోకుండా పట్టుకున్న రోజు నుండి నువ్వు నా గురించే ఆలోచిస్తున్నావు. ఇంత సుకుమారుడైన బాలుడు నిన్ను ఎలా పట్టుకోగలిగాడా? అని. నన్ను సర్వాంతర్యామిగా, సర్వశక్తిమంతునిగా తెలుసుకో. ఒకనాడు నా వేణుగానాన్ని వినటానికి వచ్చిన నీవు, జాతి వైరాలు మరచి, తన్మయులైన జీవులందరినీ కూడా నువ్వు చూశావు. తొలి దర్శనంలోనే నీ మనస్సులో ముద్ర వేశాను. నా తత్త్వాన్ని నువ్వు అర్థం చేసుకోవటానికి నీకు ఇంతకాలం పట్టింది. నిన్ను విడిచి వెళ్ళే రోజు తప్పక వస్తుంది. నువ్వు ఏం చేస్తావో, ఏం చేయాలో ముందు ముందు నీకే తెలుస్తుంది. అదీ నా అనుగ్రహంతోనే" అన్నాడు గంభీరంగా.

అటువంటి రోజు రానే వచ్చింది. ఎప్పటిలాగే అడవికి వెళ్ళింది పూర్ణ. గోవులున్నాయి, గోపాలురున్నారు కాని వారి మధ్య నల్లనయ్య లేడు. 'పూర్ణక్కా! కృష్ణయ్య..... ఊరికి వెళ్ళిపోయాడట! ఇక తిరిగి రాడట! మా పెద్దవాళ్ళు చెప్పారు' అంటూ వెక్కిపెట్టి ఏడుస్తూ చెప్పారు పిల్లలు. నువ్వు లేకపోతే పచ్చిక ఎందుకు తినాలన్నట్లుగా నిలబడ్డాయి గోవులు. గోపాలురంతా చద్దిమూటలను యమునలో పారేస్తున్నారు దుఃఖంతో. పూర్ణ మనస్సు చిక్కబట్టుకుంది. తన కర్తవ్యం ఏమిటో కృష్ణయ్య అనుగ్రహంతో తెలిసింది. చటుక్కున వెళ్ళి పిల్లల చెయ్యి పట్టుకుంది. ఎక్కడికి వెళతాడు మనల్ని వదిలిపెట్టి. ఊరికే దొంగాట ఆడుతున్నాడు అంతే! మళ్ళీ వచ్చేస్తాడు' అంటూ నచ్చచెప్పి, ముద్దలు చేసి నోట్లో పెట్టింది. ఇప్పుడు పూర్ణకి గోపబాలురు, గోవులు అందరూ, అన్నీ కూడా కన్నయ్య లాగే కనబడుతున్నారు. యమున గలగలలు, కన్నయ్య చిరునవ్వులే వినబడుతున్నాయి. అవును! వారందరి ఆలోచనలలో, మనస్సులలో, బ్రతుకుల్లో నిండిపోయి ఉన్న కృష్ణస్వామి నవ్వుతూ తిరుగుతూ ఆడుతూ వేణువు ఊదుతూ మురిపిస్తూ మైమరిపిస్తూ ఉన్నాడు. చూడాలనే ఆలోచన వచ్చేసరికి కళ్ళెదుటే నిలబడుతున్నాడు!

సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ!

# సంక్షేమ కార్యక్రమాలు

జూన్ 25వ తేదీన యోగిని శ్రీచంద్రకాళీప్రసాద ట్రస్ట్ భక్తులు నింద్రకొలను, గోపవరం, భువనపల్లి, గణపవరంలోని 9 ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేసిన దృశ్యాన్ని క్రింద తిలకించ వచ్చు.





ఆశ్రమ భక్తులైన శ్రీ డి.యస్. రవికుమార్ గారు జూన్25వ, తేదీన నోట్‌బుక్ పంపిణీ కార్యక్రమానికి విచ్చేసి, నింద్రకొలను, గోపవరం, భువనపల్లి ప్రభుత్వపాఠశాలలకు 10 క్రాంప్టన్ ఫ్యాన్‌లు దానం చేశారు. ఆ దృశ్యాన్ని కూడా పైన తిలకించవచ్చు.

ఈ సంవత్సరం పూజ్యశ్రీ మాతాజీవారి షష్ఠిపూర్తి మహోత్స సందర్భంగా భక్తులు లలితా సహస్రనామం, శివకవచం, మహా మృత్యుంజయ మంత్రం పారాయణ చేస్తున్న విషయం అందరకీ విదితమే. ఇదే విధంగా బాబూజీ భక్తసమాజ్‌వారు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

• • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • •

జులై 14 నుండి 25 వరకు జరిగిన గోదావరి పుష్కరాలలో శ్రీకాళీవనాశ్రమ శాఖవారు నిత్యాన్నదానం చేశారు. మెడికల్ క్యాంప్ కూడా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం పురాణప్రవచనం, శ్రీమాతాజీవారి అభిభాషణ జరిగాయి.

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

శంకర భగవత్పాదుల వారు బ్రహ్మము యొక్క నిత్యతత్త్వాన్ని తెలియ జేయటానికి జగత్తుని వేరుగా ప్రస్థావించటం జరిగింది కాని జగత్తే బ్రహ్మ. మట్టి లేకుండా కుండ లేదు. అలాగే బంగారం లేకుండా ఆభరణాలు లేవు. జగత్తు నీ కంటె అన్యంగా లేదు.

జగత్తుగా భాసించే నీవు, నీ భార్యా పిల్లలు, నీ ధనము, నీ ఆభరణాలు, నీ ఇల్లు వాకిలి అన్నీ బ్రహ్మమే. ఉన్నది అని అంటే ఏదైనా సత్తే. నీ స్వరూపాన్ని ఎప్పుడు మరుస్తావో అప్పుడే జగత్తు వేరుగా గోచరిస్తుంది. నీ శరీరము క్షేత్రము కాదు. క్షేత్రజ్ఞుడు ఎక్కడ ఉన్నాడు? బుద్ధికి ఆవల ప్రకాశిస్తున్నాడు. దేహభావన మరచినప్పుడే క్షేత్రము అనిపించుకుంటుంది. బ్రహ్మము లేక నువ్వు భావన చేసే క్షేత్రజ్ఞుడు భావాభావాలకు ధర్మాధర్మాలకు అతీతమైనది. దేహం కూడా బ్రహ్మమే.

తల్లిదండ్రుల సంరక్షణలో ఉన్నవారు పిండప్రదానాలని చేస్తారు. సద్గురుమూర్తి పాదాలను ఆశ్రయించి, ఆశ్రమవాసం చేస్తూ ఆయన చెంతనే ఉన్నవారికి అంతా బ్రహ్మపిండమే. నేను తింటున్నాను, నేను నడుస్తున్నాను నేను మాట్లాడుతున్నాను అని దేంట్లో ఉన్నా అంతా బ్రహ్మమే. మసక చీకటిలో త్రాడును చూసి పాము అని భ్రమ తొలగినప్పుడు కూడా ఉన్నది త్రాడే. అసలు పాము అన్నది లేదు. ఆకాశం నీలివర్ణంలో గోచరించి అక్కడ ఏదో ఉన్నట్లు గోచరించ వచ్చు అది యదార్థంగా ఖాళీ ప్రదేశమే.

ముగ్గురు వ్యక్తులు సినిమా చూసి వస్తున్నారు. సత్రంలో ఉన్న స్థంభాలను చూసి దొంగలు అని భ్రమ చెందారు. అలా భ్రమ చెందటాన్నే అజ్ఞానం అంటారు. ప్రపంచం అంతా జ్ఞానమే. అజ్ఞానం ఎక్కడిది? బ్రహ్మతత్త్వం తెలియకుండా చేసేదే నీ మనస్సనే అజ్ఞానము.

- సశేషం

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

- శ్రీ రామానుజ దాసు

నారాయణం నమస్కృత్య ; నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం ; తతో జయముదీరయేత్ ॥

నర, నారాయణ స్వరూపులైన శ్రీకృష్ణార్జునలకు, సరస్వతీ మాతకు, వ్యాసభగవానునికి నమస్కరిస్తూ భారతంలోని ముఖ్యమైన కథలను తెలుసుకోవడానికి ప్రయత్నం చేద్దాము.

మహాభారతమును 'పంచమ వేదం' అని కూడా అంటారు. దీనికే 'జయ' అని ఇంకొక పేరు కూడా ఉంది. మహాభారతం 'శత సహస్ర సంహిత' అనగా లక్ష శ్లోకాల వరకు కలిగిన బృహద్గ్రంథం. దాదాపుగా వ్యాసభగవానుడు ఈ గ్రంథం వ్రాయటానికి మూడు సంవత్సరాల కాలం పట్టింది. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలు సాధించేందుకు మానవునికి, వేదాలు, పురాణాలు, శాస్త్రాలు, ఉపనిషత్తులు అవసరం అవుతాయి. అయితే మహాభారత పఠనం వలన వీటి సారాంశం మనకు ద్యోతకమవుతుంది.

'అమితాఖ్యానక శాఖలం బొలిచి వేదార్థామల చ్ఛాయమై
సుమహద్వర్గ చతుష్క పుష్ప వితతిన్ శోభిల్లి కృష్ణార్జు నో
త్తమ నానా గుణ కీర్తనార్థ ఫలమై, ద్వైపాయనో ద్యాన జా
త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీ సురప్రార్థ్యమై'

అనేక అపాఖ్యానములు (కథలనే) కొమ్మలుగా కలిగి, వేదములలోని అర్థమే నిర్మలమైన నీడగా ఉండి, ధర్మ అర్థ కామ మోక్షములనే నాలుగు పురుషార్థములనే పూవుల సముదాయంతో ప్రకాశిస్తూ ఉండే ఫలములు కలిగినదై వ్యాస భగవానుడనే ఉద్యానవనంలో పుట్టింది ఈ మహా భారత ఇతిహాసం. ఇది కల్పవృక్షం. సర్వ పురుషార్థ విజ్ఞాన ఫల ప్రధానం.

మహాభారతంలో ఉపాఖ్యానములు అనేకం. ఆ ఉపాఖ్యానములు అందించే నీతిని మనం తెలుకుకోవడానికి ప్రయత్నం చేద్దాం. భారతమంతా 18 పర్వాలు. 18 అనే సంఖ్యకు వ్యాసుడు అమిత ప్రాధాన్యత నిచ్చాడు. వ్యాసుడు వ్రాసిన పురాణాలు 18. ఇవే అష్టాదశ పురాణాలు.

'మ'ద్వయం 'భ'ద్వయం చైవ 'బ్ర' త్రయం 'వ' చతుష్టయమ్
అ,నా,ప,లిం,గ, కూ, స్కా,ని పురాణాని పృథక్ పృథక్॥

'మ' అక్షరంతో 2 పురాణలు - 1. మత్స్య, 2. మార్కండేయ పురాణం.

'భ' అక్షరంతో 2 పురాణాలు -1. భవిష్య, 2. భాగవత పురాణం.
'బ్ర' అక్షరంతో 3 పురాణాలు -1. బ్రహ్మ, 2. బ్రహ్మాండ, 3. బ్రహ్మ వైవర్త.
'వ' అక్షరంతో 4 పురాణాలు -1.వాయు, 2వామన, 3.విష్ణు, 4. వరాహ
అ - అగ్నిపురాణం,
నా - నారద పురాణం,
ప - పద్మ పురాణం,
లిం - లింగ పురాణం,
గ - గరుడ పురాణం,
కూ - కూర్మ పురాణం
స్కా - స్కాంద పురాణం
వ్యాసుడు వ్రాసిన 18 పురాణాలు ఇవి.

ఇక భారత విషయానికి వస్తే 18 పర్వములు. వీటిలో ఆది పంచకం 5, యుద్ధ షట్కము 6, శాంతి సప్తకం7, - అని 18 పర్వాలుగా విభజించ వచ్చు. వీటిలో శాంతి పర్వము మొదలుకుని ఆ తరువాత ఉండే పర్వాలకు శాంతి సప్తకమని, 'శాంతి'కే వ్యాసభగవానుడు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాడని తెలుస్తుంది.

మహాభారతంలోని పర్వములు 18. దీనిలో ముఖ్యమైన భీష్మ పర్వంలో 'భగవద్గీత' అందుతుంది. గీత అధ్యాయాలు 18. యుద్ధంలో పాల్గొన్న అక్షౌహిణులు సంఖ్య 18. యుద్ధం జరిగిన రోజులు18.
అక్షౌహిణి అనగా 21, 870 రథాలు (2+1+8+7+0 = 18)
21, 870 ఏనుగులు (2+1+8+7+0 =18)
65, 610 గుఱ్ఱాలు (6+5+6+1+0 =18)
1,09, 350 కాల్బలం (1+0+9+3+5+0 =18)

ఈ విధంగా యుద్ధంలో అక్షౌహిణి సంఖ్యలను కూడిన 18 సంఖ్య వస్తుంది. ఈ భారతగ్రంథానికి 'జయ' అని పేరుంది అనుకున్నాం కదా! అందులో కూడా సంఖ్య శాస్త్రం ప్రకారం 'జ' అనే అక్షరం 8ని, 'య'అనే అక్షరం 1ని సూచిస్తుంది.

ఇక వ్యాసుడు అందించిన మహాభారత ఉపఖ్యానములను, వాటి ద్వారా మానవుడు తెలుసుకోవలసిన నీతిని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

- సశేషం

# శివకేశవ ఏకత్వము

- రావి శోభ

రాజా మహేంద్రవర్మ అఖిల భారతావని తీర్థయాత్రలు చేసి వచ్చిన తన గురువర్యుని "గురుదేవా! దైవ స్వరూపులైన మీ ముఖతః శివకేశవ తత్త్వం గురించి వినాలని మాతోపాటు యిక్కడి సభ్యులందరూ కూడా ఎదురు చూస్తున్నారు. కాబట్టి దయచేసి వివరించండి" అని వినయంతో ప్రార్థించాడు.

గురుదేవులు రాజుతో "రాజా! స్కాందపురాణంలో వ్యాసమహర్షి వర్ణించినట్లుగా 'శివశ్చ హృదయం విష్ణోః విష్ణోశ్చ హృదయగ్ం శివః' అన్నట్లుగా వారిరువురు ఒకరి హృదయంలో మరొకరిని ఎప్పుడూ ధ్యానిస్తూనే వుంటారు. రాజా! మీరన్నట్లు వారిరువురిది తత్త్వం కాదు 'ఏకత్వం' అని, వివరిస్తూ....................

" కైలాసగిరిలో సదాశివ కుటుంబాన్ని ప్రత్యేకతతో చూపిస్తారు. కారణం ఆ స్వామి వాహనం ఎద్దు అమ్మవారు సింహవాహిని. అలాగే పిల్లలిద్దరివీ గణపతిది చిన్న ఎలుక, కుమారస్వామిది నెమలి వాహనం. ఈ విధంగా శత్రువు మిత్రుల భేదం లేకుండా సదాశివ కుటుంబంగా నిలిచింది.

అదేవిధంగా వైకుంఠవాసుని వాహనం గరుత్మంతుడు కాగా, ఆయన శయనించే తల్పం ఆదిశేషుడు. అందుకే పన్నగ శాయిగా పేరు పొందాడు లక్ష్మీనాధుడు.

గంగానదికి విష్ణుమూర్తి పాదాలు పుట్టినిల్లు కాగా, ఆమె నివాసం రుద్రుని జటాజూటం అయింది. ఈ విధంగా గంగాధరుడుగా పేరుపొందాడు మహాదేవుడు.

హస్తి (ఏనుగు) అర్పించిన జలాన్ని అభిషేకంగా స్వీకరించి దానికి ముక్తిని ప్రసాదించాడు శ్రీకాళహస్తీశ్వరుడు. అదే రీతిలో ఆనాడు గజరాజు ప్రార్థనని మన్నించి, మొసలి నుండి కాపాడి గజేంద్రుడి (ఏనుగు)కి ముక్తి ప్రసాదించాడు సర్వవ్యాపకుడైన మహావిష్ణువు.

పర్వతాన్ని కవ్వంగాను, వాసుకిని తాడుగా చేసుకుని పాల సముద్రాన్ని చిలకగా వచ్చిన కాలకూట విషాన్ని లోకాలను కాపాడటం కోసం తన కంఠంలో బంధించి నీలకంఠుడిగా ప్రసిద్ధిచెందాడు బోళాశంకరుడు.

ఈ మంధర పర్వతాన్నే కూర్మం రూపంలో తన వీపుమీద మోసి అమృతాన్ని మోహినీ అవతారంలో అందరికీ పంచిపెట్టాడు విష్ణుమూర్తి. ఆ అందమైన మోహినీ అవతారం త్రినేత్రుడికి కూడా మోహాన్ని కలిగించింది.

మశ్చీంద్రనాథ్ (మహావిష్ణువు), సంసారం అనే భ్రమలో వున్నప్పుడు వారి భ్రమను, మోహావేశాలను గోరఖ్‌నాథ్ (శివుడు),తొలగించాడు.

దానమిచ్చిన దానవేశ్వరుడి గర్భంలో దాగి, అతనికి మోక్షాన్నిచ్చి మృగచర్మధారి అయ్యాడు గిరిజాపతి.

ఇలాగే దానమిచ్చిన దానవేశ్వరుడు బలిని పాతాళానికి అణచి అక్కడే ద్వారపాలకుడయ్యాడు వామనుడు (మహావిష్ణువు).

బాల పరంధాముని దర్శనానికై పరితపించి రేపల్లెకు వెళ్ళాడు జంగమేశ్వరుడు కైలాసపతి. ఆ జంగమేశ్వరుని దర్శనం కోసం లేని దుఃఖాన్ని తెచ్చుకుని తల్లిద్వారా మరీ దర్శనమిచ్చాడు సర్వాంతర్యామి.

పార్వతీదేవి మనస్సంకల్పం చేత పిండి గణపతి, నిఖిల జగాలకు గణాధిపతిగా గణేశుని ఆవిర్భావం చేస్తే, నాభి నుండి పద్మసంభవుని రాకకు విష్ణువే మూలకారణమయ్యాడు.

నుదుట చిన్నరాత కూడా లేని బిచ్చగాడు భక్తులపాలిట అపర కుబేరుడు పార్వతీపతి.

తల్లిదండ్రుల ఊసే లేని జగన్నాథుడు అఖిల బ్రహ్మాండాలకు ఆయనే తల్లిదండ్రి రక్ష ఆ లక్ష్మీపతి.

ద్వాపరమందు యశోదమ్మ చూపిన మాతృబంధానికి బంధింపబడి వకుళమాతచేత కొడుకుగా పిలిపించుకున్న తిరుమల తిరుపతి శ్రీనివాసుడు.

కడుపున పుట్టకపోయినా భావనలోనే మాతృప్రేమను పెంపొందింపచేసి తల్లిలాగా బెజ్జమహాదేవిని కృతార్థురాలిని చేశాడు హరహర మహాదేవుడు."

ఏ రూపంలో ఎవరికి ఏ విధంగా ముక్తి ఇవ్వాలో నీకు తప్ప అన్యులకు తెలియదు. అటువంటి ఆ జనులందరికీ తల్లివై, తండ్రివై భక్తులకు దైవానివై, హితులకు శ్రేయోభిలాషివై అనన్యమైన నీ కృపకు అర్హులను చేసిన ఆ పరమాత్మ తత్వమైన 'శివకేశవ ఏకత్వం' నీవే కదా సద్గురు ప్రభూ!

# ప్రబోధము

- రమణ ప్రసాద్

(జులై 3, 4, 5 తేదీలలో శ్రీమాతాజీ అమెరికా (న్యూజెర్సీ)లో చేసిన అభిభాషణను సంక్షిప్తంగా అందిస్తున్నాము.........................)

3-7-2015 శుక్రవారం

ధ్యాన మూలం గురోమూర్తిః। పూజా మూలం గురోః పదమ్।
మంత్ర మూలం గురోర్వాక్యం। ముక్తి మూలం గురోః కృపా॥

శ్రీసద్గురుదేవుల అనుగ్రహంతో మనం నిర్ణయించుకున్న కార్యక్రమాన్ని మొదలు పెట్టుకున్నాము. ప్రాతఃకాలం బ్రాహ్మీముహూర్త సమయం అనేవారు శ్రీగురుదేవులు. ప్రశాంత వాతావరణంలో ఆలోచనలు తక్కువగా ఉండి, మనస్సు నిర్మల స్థితిలో వుంటుంది. పొద్దెక్కినకొద్దీ ఆలోచనలు పెరిగి మనస్సును కలవర పెడతాయి. కదలికలు ఎక్కువగా వుంటాయి. మనస్సును సూక్ష్మ శరీరం అన్నారు. అది మనకు కనబడదు. దేవుడు కనిపిస్తున్నాడా? కనిపించడు. కాని దేవుడు రూపధారణ చేసి, మహాత్ముల రూపంలో మన మధ్యకు వచ్చి మనలను సన్మార్గంలో నడిపిస్తున్నాడు.

కానీ మనం మహాత్ములను గుర్తించలేక వారిని మానవ మాత్రులుగానే చూస్తాము. దేవుడే దిగి వచ్చి 'నాతో వచ్చేయిరా అబ్బాయి!' అంటే ఎంత మంది వెళ్తారు? పైగా 'దేవా! మీరిచ్చిన భార్యా బిడ్డలేకదా! వదిలిపెట్టి రమ్మనమంటే ఎలాగండీ?' అని ఎదురు ప్రశ్నవేస్తారు. అందుకనే శ్రీ గురుదేవులు భక్తులతో 'నన్ను మీ యింట్లో ఒక గెస్ట్‌గా అనుకోండి' నేను అనుగ్రహించటానికి సిద్ధంగా వున్నాను. 'నువ్వు ఏ పని చేస్తున్నా నన్ను గుర్తుపెట్టుకో చాలు' అన్నారు. అంటే నువ్వు చేసే ప్రతిపని వారి అనుగ్రహంతోనే జరుగుతోందని గుర్తించు.

కాని 'నేనే చేశాను' అనుకుంటావు. నీ వెనుక ఒక అవ్యక్తమైన శక్తి నీ యింద్రియాల చేత పనిచేయిస్తోంది. పగలంతా శ్రమించిన వానికి విశ్రాంతి అవసరం. అదే రాత్రి నిద్రపోవడం. అది మానవుడికి భగవంతుడిచ్చిన 'గిఫ్ట్' అన్నారు శ్రీగురుదేవులు. మానవుడు తిండి లేకపోయినా వుండ గలడు కాని, నిద్ర లేకుండా వుండలేడు.

ఈ బ్రాహ్మీముహూర్త సమయం ధ్యానానికి చాలా అనుకూల మైనది. ప్రశాంత వాతావరణంలో మనస్సు ప్రశాంతత చెందుతుంది. అందరూ కలిసే ధ్యానం చేస్తే ధ్యాన తరంగాలు అంతటా వ్యాపిస్తాయి. ఏకాగ్రత బాగా కుదురుతుంది. నువ్వు పట్టిన పాదాన్ని గాఢంగా విశ్వసించాలి. భగవంతుడు నీకు పరంగా లేడు. తెల్లవారుజామున కదలికలు వుండవు. గంట లేక

అరగంట చేసినా కూడా ధ్యానం బాగా కుదురుతుంది. ధ్యానాగ్నిలో నీ సంచిత కర్మలన్నీ నశించిపోతాయి.

గురుదేవుల యెడల విశ్వాసం కుదరాలంటే సత్యాన్ని గుర్తించాలి. సత్యం యీ ఉపాధులకు కనిపించని అవ్యక్తమైన శక్తి. అది మనందరిలో, మనందరి మధ్య అనంతంగా ప్రకాశిస్తోంది. సాధకుడు బ్రతకటం కోసం తినాలి. సమయం వృథా చేయకూడదు. తానెవరో గుర్తించాలి. అది యింద్రియాతీతమైన స్థితి. అక్కడ మనస్సు లయించిపోతుంది. ఇటువంటి స్థితిని మనం నిదురలో అనుభవిస్తున్నాము. కాని అక్కడ మనస్సు అణిగి వుంటుంది. మనస్సు కలలు కంటుంది. ఆ స్వప్నాలు నిజం కాదని మెళకువ వచ్చాక తెలుస్తుంది.

ధ్యానంలో ఆలోచనలు వస్తాయి. మనస్సు వాటితో పరుగులు పెట్టకుండా సాక్షిగా వాటిని చూడాలి. ఆలోచనలు క్రమక్రమంగా తగ్గుతాయి. మనస్సు శనగగింజ లేక ఆలివ్ వంటిది. ఎందులో వేస్తే ఆ రుచిని పొందుతుంది. అలాగే మనస్సుకు వాసన లేదు. కాని మనస్సు ఎందులో నిలబడుతుందో ఆ వాసనను పొందుతుంది. ఒక తెల్ల బట్టను ఏ రంగులో ముంచితే ఆ రంగును సంతరించుకున్నట్లుగా.

మనం సమర్థమైన గురుపాదాన్ని ఆశ్రయించాము. గురుదేవుల అనుగ్రహం మనమీద వుంది అనే ధైర్యోత్సవాలతో ధ్యానానికి కూర్చోవాలి. నువ్వు చూసేవి, వినేవి సాధనపరంగా వుండాలి. 'భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।' అని వేదం చెబుతోంది. కాబట్టి నీ చెవులను, కనులను భద్రంగా వుంచుకో. విషయాదులపై పరుగులెత్తనీయకు. మనస్సుకు లోబడిన వాడు మానవుడు, మనస్సును లోబరుచుకున్నవాడు మహాత్ముడు.

ధ్యానంలో రీల్స్ లాగ ఆలోచనలు వస్తాయి. వాటిని అనుసరించ కూడదు. సాక్షీభావంతో చూడాలి. దీనినే మాయ అంటారు. మాయకు సంబంధించిన యీ ఆలోచనలు మానవుని తట్టి లేపుతాయి. మనం వాటికి స్పందించకుండా జాగ్రత్త పడాలి. నీ మనస్సును నీ అధిష్ఠాన దేవతపైగాని, అధిష్ఠాన మంత్రంపైన గాని వుంచాలి. ఆలోచనలు వస్తే యిది 'మీ సయయంకాదు' అని ప్రక్కకు నెట్టివేయాలి. ఈ ఆలోచనలకు మూలం మన జీవితంలో జరిగే సంఘటనలే అని తెలుసుకోవాలి.

(తరువాయి భాగం కోసం 31 వ పేజీ చూడండి)

# తల్లి కృప త్వరగా లభిస్తుంది

(శ్రీరామకృష్ణుల గూఢార్థ కథల నుండి)

ఒక పేద బ్రాహ్మణుడికి ధనికుడైన ఒక బట్టల వర్తకుడు శిష్యునిగా వుండేవాడు. ఆ వర్తకుడు పరమ లోభి. ఒకరోజు ఆ బ్రాహ్మణుడికి తన దేవతార్చన గ్రంథాన్ని కప్పుకోవడానికి ఒక గుడ్డ కావలసివచ్చింది. ఆయన తన శిష్యుని వద్దకు వెళ్ళి అడిగాడు.

ఆ వర్తకుడు "అయ్యో! పదినిమిషాల క్రితం చెబితే మీకు కావలసిన గుడ్డ యిచ్చేవాణ్ణి. ఇప్పుడు మీకు పనికివచ్చే చిన్నముక్క నా దగ్గర ఏమి లేదే! ఏం దురదృష్టం! కానివ్వండి. మీరు అడిగింది నేను గుర్తుంచుకుంటాను. అయినా అప్పుడప్పుడు జ్ఞాపకం చేస్తూ వుండండి" అన్నాడు.

పాపం! ఆ బ్రాహ్మణుడు నిరాశతో వెనుతిరిగి వెళ్ళిపోతున్నాడు. గురువుగారికి శిష్యోత్తముడికి మధ్య జరిగిన సంభాషణ ఆ వర్తకుని భార్య తెరచాటు నుండి విన్నది. ఆయన్ని వెనుకకు పిలిచి 'స్వామీ! మీరు ఆయనను ఏమి అడుగుతున్నారు?' అని విచారించింది. జరిగినదంతా విన్న తరువాత ఆమె "చిత్తం! మీరు యింటికి వెళ్ళండి. మీరు కోరిన గుడ్డ రేపు ప్రొద్దుటే మీకు చేరుతుంది!" అని వర్తకుని భార్య చెప్పింది.

రాత్రి వర్తకుడు యింటికి రాగానే 'దుకాణం మూసేశారా?' అని భార్య అడిగింది. "ఔను! ఏమిటి విశేషం?" అని అడిగాడా వర్తకుడు. "ఇప్పుడే వెళ్ళి రెండు నాణ్యమైన బట్టలు తీసుకురండి" అన్నది భార్య. "ఎందుకంత తొందర? రేపు ప్రొద్దుటే తెస్తాను లే" అన్నాడు.

"అలా కాదు. ఇప్పుడే కావాలి నాకు" అన్నది. పాపం! ఆ నిర్భాగ్యుడు ఏం చేస్తాడు? మాయ మాటలతో, కల్లబొల్లి వాగ్దానాలతో పంపి వెయ్యడానికి యీమె తన ఆధ్యాత్మిక గురువు కాదుకదా! తన తెరచాటు గురువు! ఆమె ఆజ్ఞ అమలు చేసి తీరాలి. లేకపోతే 'ఇంట పోరు ఇంతింతగాదయ్యా!' అన్నట్లు అవుతుంది.

వర్తకుడు విధి లేక ఆ అర్ధరాత్రి వేళలో వెళ్ళి, దుకాణం తీసి, భార్య కోరిన బట్టలు తెచ్చాడు. మరునాడు ప్రొద్దుటే ఆమె ఆ గురువు గారికి కావలసిన బట్టను పంపిస్తూ 'ఇక మీదట మీకు ఏదైనా కావలసి వస్తే నన్ను అడగండి. మీకు సర్వమూ లభిస్తాయి' అని కబురు చేసింది.

కాబట్టి దయామయి అయిన లోకేశ్వరిని శరణువేడి, ఆమె వరప్రసాదాన్ని కోరే వారి ప్రార్థనలు, భగవంతుణ్ణి పితృభావనతో అర్చించేవారి ప్రార్థనల కంటె శీఘ్రంగా సులభంగా నెరవేరే అవకాశం వున్నదని గ్రహించాలి" శ్రీరామకృష్ణులు చెప్పారు.

(ప్రబోధం - 29 వ పేజీ తరువాయి భాగం)

గురుదేవులు అందించిన బోధను విచారణ చెయ్యండి. మనస్సు తేలికగా నిలుస్తుంది. మిమ్మల్ని సంసారం విడిచిపెట్టమని ఎన్నడూ గురుదేవులు మీకు చెప్పలేదు. మీ స్వధర్మాన్ని ఆచరిస్తూనే సాధన చేయండి అన్నారు. మన అదృష్టంకొద్దీ గురుదేవులు మనకు పరమాత్మ తత్త్వాన్ని అందిస్తున్నారు. వారి దర్శనంతో ఎంతో తృప్తి లభిస్తోంది. సందర్శించటానికి మనం ఆయన దగ్గరకు వెళ్తాం ఆయన మన దగ్గరకు రారు, నేను యిక్కడకు వచ్చినా మీరంతా నన్ను చూడటానికి వచ్చినట్లుగా.

భగవంతుడు సృష్టిచేసి తాళం మనకే యిచ్చాడు. 'మీరు జీవితాన్ని సక్రమంగా గడిపి గమ్యాన్ని చేరుతారో లేక వ్యర్థమైన జీవితం గడుపుతారో మీ యిష్టం' అన్నాడు. భగవంతుని, గురుదేవుని గుర్తించటానికి ఒక పాత్రతను నీకిచ్చారు. దాన్ని నీవు నిలబెట్టుకో.

ధ్యానానికి మనమందరమూ అధికారులమే. ధియానం అంటే బుద్ధియొక్క ప్రయాణం. ధ్యానానికి ఏకాగ్రత ముఖ్యం. దేహం ఎలా సహకరిస్తే అలా కూర్చోండి. ఆసన శుద్ధి కలిగి, మనస్సును ఊర్ధ్వముఖం చేసిగాఢమైన విశ్వాసాన్ని పెంపొందించుకుంటే ధ్యానం మనవెంట పడి వస్తుంది. 'ధ్యానం నిర్విషయం మనః' అని వేదం చెబుతోంది. కాబట్టి అందరూ అటువంటి ధ్యానాన్ని యీ ప్రశాంత ఘడియలలో చేసుకుని శ్రీగురుదేవుల అనుగ్రహానికి పాత్రులవుదురు గాక!!

# సత్సంగామృతం

(గత సంచిక తరువాయి) - మురళీ

మనం అన్నీ విడిచి భగవంతుడి దగ్గర (ఆశ్రమంలో) ఉన్నాము. భగవంతుడి సేవే కావాలనుకుంటున్నాము. మనం ఎప్పుడూ మంచినే మాట్లాడాలి. ఎదుటివారిలో మంచినే చూడాలి. స్వామి చెబుతూ ఉండేవారు. - ఇసుకలో పంచదార కలిస్తే, చీమ పంచదారను వెతుక్కుంటుంది కాని, ఇసుక ఉన్నదని వెళ్ళిపోతుందా? చీమకే వెతుక్కునే బుద్ధి ఉన్నప్పుడు, ఆ ఆలోచన మనకెంత ఉండాలి. అందులోను మనకు ఈ జన్మలో సమర్థ సద్గురుదేవుల ఆశ్రయం లభించింది. కనుక ప్రపంచంలోని యితర విషయాలు అవసరం లేదు. గురుదేవులు ప్రసాదించిన దానిని మన స్వంతం చేసుకుందాం అనుకున్నాం. చీమే పంచదార కోసం వెతుక్కుంటుంటే, మన జీవితానికి ఏమి కావాలో మనం వెతకనవసరం లేదా? నూతిలో నీరు తోడాలంటే బకెట్టు, త్రాడు చిన్నకొస బయటకు ఉంటే దాని సహాయంతో మొత్తం నీరు త్రోడవచ్చు. అలాగే మనిషిలో ఒక్క మంచి గుణం ఉంటే చాలు మిగిలినవన్నీ వాటంతట అవే కలుగుతాయి.



మనకంటె గొప్పవాడు ఉన్నాడంటే ఎవరై ఉంటారు? వారే గురుదేవులు. గురుదేవులు మనలో ఏమి చూసి మన జీవితం ఇలా గడవటానికి ఆధారమయ్యారు? వారిని ఆశ్రయించినందుకు అవ్యాజ కరుణతో మన జీవితాలను ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్నారు. వారి కరుణ లేకపోతే మన జీవితం వ్యర్థమే.

'నువ్వు ఎక్కడికి పోతావురా నాయనా! నువ్వుపోతే నేనేం చేస్తాను? నా దగ్గర సేవ చేసుకుంటూ ఉండు. నీకన్నీ వాడే ఆ భగవంతుడే ఇస్తాడు. వాడే నడిపిస్తాడు' అనేవారు గురు మహరాజ్. గురుదేవుల

పరిపూర్ణ అనుగ్రహం, గురుశక్తి అందరిలో ఉంది. కాని ఆ శక్తి నిద్రాణమై ఉన్నది. నీలోని శక్తికి జాగృతి కలిగించు. లే! ఇంకెన్నాళ్లీ సోమరితనం? సోమరితనమే అజ్ఞానం.

గురుదేవుల వద్ద రహస్యం లేదు. అందుకనే ఆ మహానుభావులు జగన్మాత బీజాక్షరాలను జాగ్రత్తగా సంపుటీకరించి (ఓం క్లీం ఐం హ్రీం శ్రీం) నామాలు చదవమన్నారు. మనం చేసే సాధన రహస్యంగా ఉంచుకోవాలి. అనుభూతి ఎంత చెప్పుకున్నా మాటలకు అందేది కాదు. అది విన్నవాడికి తెలియదు, అనుభవించేవాడికేగాని.

మనలోని జ్ఞానం అనేదాన్ని అనుభవింపజేసేది గురుతత్త్వం. ఎవరి అనుభూతి వారికే రహస్యం. అది అంతరించి పోయేది కాదు. వికసించిన మనో పుష్పాన్ని గురుచరణారవిందాలకే చేర్చాలి. కాబట్టి జీవితం వచ్చినందుకు మహాత్ములు చెప్పినటువంటి బోధను మనం మరచి పోకూడదు. పూర్వస్మృతి మనతోపాటు ఉంటూ మనదైనటువంటి సత్యమైన స్మృతిని, సర్వకాల సర్వావస్థలయందు అఖండ జ్ఞానాన్ని, భక్తిని సాధనా సంపత్తిని శ్రీగురుపాదుకలు సర్వదా ప్రసాదించి రక్షించుగాక!!



# ఆషాఢ పూర్ణిమ విశిష్టత

- సుషుమ్నా ప్రసాద

ఆ, కా, మా, వై అనే నాలుగు గురు పూర్ణిమలు లేక వ్యాస పూర్ణిమలు, గురుపుత్రుల ఆధ్యాత్మిక ప్రగతికి దివ్యసోపానాలు. వరుస క్రమంలో వైశాఖ పూర్ణిమ ప్రథమమైనా ఆషాఢ పూర్ణిమతో ప్రారంభం అవటంలో ప్రత్యేకత ఉన్నది.

'ఆ' అనే అక్షరం 'ఆధ్యాత్మిక సాధన'కు చాలా ప్రాముఖ్యమైనది. 'ఆ' అనే అక్షరం 'ఆశ'కు సంకేతం. మానవుడు ఆశాజీవి. సంఘజీవి. 'శ్వాస పోయినా ఆశ పోద'నే నానుడి ఉన్నది. మానవుని మనుగడకు ఆశ, ఆశయం ఎంతో ప్రధానమైనవి. ఆశయం లేక లక్ష్యం లేని మానవుని జీవితం చుక్కాని లేని నావవంటిది. ఆశయ రహితమైన జీవితం కేవలం మృగతుల్యం. 'ఆశ' అనేది మానవుని జీవితానికి ముఖ్యమైనదే కాని అది 'పేరాశ, దురాశ' కాకూడదు.

శ్రీగురుదేవులు శ్రీబాబూజీ మహరాజ్ తమ దివ్య కీర్తనలో 'బ్రహ్మ జ్ఞానికి ఒకదానిపైనే ఆశ. బ్రహ్మజ్ఞానికి లేదు వినాశము' అన్నారు. 'ఆ' అనే ఆక్షరం ఆధ్యాత్మిక ప్రగతికి, ఆత్మానాత్మ వివేకమునకు, ఆద్యంత రహితమైన పరమాత్మకు, ఆత్మానందమునకు సంకేతము. 'ఆ' అనే అక్షరంలో ఎంతో పరమార్థం యిమిడి వుందని శ్రీగురుదేవులు తెలిపారు.

విషయాసక్తమైన ఆశ, వివేకాన్ని కోల్పోయేటట్లు చేస్తుంది. విశ్వేశ్వరాసక్తమైన ఆశ సద్వివేకమును, ఆనందాన్ని ప్రసాదిస్తుంది. సద్గురుదేవుని పూర్ణానుగ్రహంతో మాత్రమే ఆశ అనే పాశాన్ని ఛేదించ గలము. ఆశ అనే ఆకర్షణీయమైన సంకెళ్ళల్లో బంధీయైన మానవుడు సుఖదుఃఖాలనే సుడిగుండంలో ఉక్కిరిబిక్కిరి అవుతాడు.

భగవాన్ బాబూజీ ఆశను అధిగమించడానికి, నిర్జించడానికి సులభోపాయాన్ని సూచించారు. భౌతిక విషయాలపై పరుగిడే ఆశను, భగవత్పరం చేస్తే, అంటే సద్గురుమూర్తివైపు ఆశను మరలిస్తే అది మహదాశయమై, మానవుని జీవిత గమ్యానికి చేరుస్తుంది.

పాత్రలో నీరు పూర్ణంగా ఉంటే అందులో నీరు తీసినా, కలిపినా, అది పూర్ణపాత్రకాదు. పూర్ణత్వంలో తీయటానికి, కలపటానికి ఆస్కారం

లేదు. ఆశను నిర్జించి, ఆశయ సిద్ధిని ప్రాప్తింపజేసేదే ఆషాఢ పూర్ణిమ. ఆశయ సిద్ధితో ఆనందం లభిస్తుంది. ఆనందం సుఖదుఃఖాలు, కలిమిలేములు, జయాపజయాలు అనే ద్వంద్వాలకతీతమైనది. సంతృప్తికి మించిన సంపద లేదు.

అలాంటి సంపన్నుడికి ఆశ సుదూరంలో ఉంటుంది. ఆధ్యాత్మిక పురోగతిని సాధించాలని కృషిచేసే సాధకుడు సద్గురుకృప అనే పున్నమి వెన్నెలలో పరవశిస్తాడు. సద్గురుని ఆదేశానుసారం తన జీవితాన్ని మలచుకున్నవాడు సద్గురు వాత్సల్యాన్ని పూర్తిగా ఆస్వాదించి, తన పురోగతికి అడ్డంగా ఉన్న ఆశను అంతరింపజేసి, సద్గురు చంద్రుని పూర్ణ అనుగ్రహమనే వెన్నెలలో పరవశించిపోవటమే ఆషాఢ పూర్ణిమ ప్రత్యేకత. ఆశాపాశమును సద్గురు పాదాశ్రయముతో ఛేదించి, ఆత్మానందమనే వెన్నెల వలువను ధరించినవానికి నిత్యమూ ఆషాఢ పూర్ణిమయే.

"సద్గురు వాత్సల్యమనే వెన్నెల వలువలను ధరించి, జ్ఞాన సుధను సంపూర్ణంగా ఆస్వాదించటమే సాధకుని పరమావధి అని, అప్పుడు నిత్యమూ గురుపుత్రునికి ఆషాఢ పూర్ణిమయే" అని సద్గురుదేవులు ప్రబోధించారు.



# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

- విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## నిండ్రకొలను డాక్టరుగారితో శ్రీబాబు

భక్తులు నిండ్రకొలను డాక్టరుగారి గురించి శ్రీబాబును అడుగగా, తాము కోరుకున్నట్లుగా వారు నిత్యముక్త స్థితిలో బ్రహ్మానందం అనుభవిస్తూ ఉన్నారని, వారిని గురించి మనం చింతించవలసిన పని లేదని, జన్మ కలిగినందుకు మానవుడు సాధించ వలసిన లక్ష్యం ఆయన సాధించారని చెప్పారు.



తమ శిష్యుడు ఏ లక్ష్యం సాధిస్తే గురుదేవులు సంప్రీతులౌతారో, అటువంటి మహోన్నత లక్ష్యాన్ని సాధించి, శ్రీబాబు పరమ అనుగ్రహానికి పాత్రులైన నిండ్రకొలను డాక్టరుగారు శ్రీగురు సాయుజ్యం పొందారు.

పెద నిండ్రకొలను గ్రామంలోని భక్తులు కొంతకాలం క్రితం శ్రీబాబు అనుమతితోను, ఆశీస్సులతోను శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఇటీవలనే ఆ ఆలయానికి ప్రక్కనే మరొక ఆలయాన్ని నిర్మించి అందులో, శ్రీబాబు దివ్యచరణ సన్నిధి సేవలో నిండ్రకొలను డాక్టరుగారు ఉన్నట్లుగా పాలరాతితో మలచబడిన 'భక్త సహిత శ్రీసద్గురు దివ్య మంగళ మూర్తి'ని పూజ్యశ్రీ మాతాజీవారి పవిత్ర హస్తములతో 1-2-2004 భీష్మఏకాదశి పర్వదినమున ప్రతిష్ఠింపజేశారు.

శ్రీలక్ష్మీగణపతి యాగ సహితముగా త్రిరాత్ర దీక్షతో నిర్వహింప బడిన ఈ ప్రతిష్ఠామహోత్సవ సందర్భంగా ప్రతిరోజూ లక్ష కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు వేల సంఖ్యలో పాల్గొని, సద్గురు కృపకు పాత్రులైనారు. ఆ సందర్భంలోనే శ్రీకాళీవనాశ్రమం యొక్క పెద నిండ్రకొలను శాఖ ప్రారంభింపబడి, భక్తులచేత సమర్థవంతంగా నిర్వహింపబడుతోంది.

# విజయవాడలో సత్సంగ సమావేశములు

సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు

శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి

దివ్యాశీస్సులతో,

శ్రీకాళీవనాశ్రమ పీఠాధిపతి, పూజ్యశ్రీ

యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాదమాతాజీవారి

సత్సంగ సమావేశములు

విజయవాడ, దుర్గాపురం లోని ఘంటశాల వెంకటేశ్వరరావు సంగీత నృత్యకళాశాలలో సెప్టెంబర్ 18, 19, 20 (శుక్ర, శని, ఆదివారాలలో) సాయంత్రం 6గం. నుండి రాత్రి 8గం. వరకు జరుగును.



అందరూ ఆహ్వానితులే!

ఉదయం కార్యక్రమములు -

తె॥జా 4గం నుండి 6గం. సుప్రభాతము, ప్రార్థన ప్రతిరోజూ జరుగును.

18-9-15 శుక్రవారం ఉదయం 9గం.లకు సంకీర్తన, లలితా సహస్ర నామంతో సామూహిక కుంకుమ పూజలు జరుగును.

19-9-15 శనివారం ఉదయం 9గం.లకు సంకీర్తన, ఆంజనేయ స్వామికి ఆకుపూజ, సిందూరాలతో సామూహిక పూజలు జరుగును.

20-9-15 ఆదివారం ఉదయం 9గం.లకు సంకీర్తన, ఆదిత్యహృదయ పారాయణ జరుగును.

ఈ మూడురోజులూ పూజ్యశ్రీ మాతాజీవారిచే తీర్థవితరణ, తరువాత మహాప్రసాద వినియోగం కలదు.

ఈ పైన చెప్పిన ఉదయం కార్యక్రమాలు జరుగు స్థలము ....

డా॥వై కృష్ణమనోహర్ 101, సాయి సూర్య ఎన్‌క్లేవ్, రెండవలైను, కేదారేశ్వర పేట, విజయవాడ - 3

వివరములకు -

94405 41266 ; 96188 37160

92464 15286 ; 86867 53336

92465 99800 ; 99488 41228

ఈ నెంబర్లను సంప్రదించవలెను.

# సర్వజ్ఞ శేఖర సద్గురనాథులు

- సుశీలా ప్రసాద

శ్రీకాళీ జయంతులు 1966సం॥లో శ్రీకాపుగంటి పాపారావు గారింట్లో తునిలో జరపటానికి శ్రీబాబు నిర్ణయించారు. రాత్రి భోజనాలకు క్రింద హాలులో వడ్డనలు జరిపి భోజనాలకు రమ్మనమన్నారు. అందరూ క్రిందకు వెళ్ళిపోయారు నేనూ, మరొక భక్తురాలు మిగిలిపోయాము.

శ్రీబాబు చకచకా క్రిందకు వెళ్ళి భోజనాలు చేస్తున్న అందరినీ పలుకరిస్తూ, వడ్డనలు చేయిస్తూ హుషారు పరుస్తుంటే మేమిద్దరం మేడ మీద నుంచే చూస్తూ 'అయ్యో! ఇంతటి మంచి సదవకాశం కోల్పోయాం' అని మనసులో బాధపడుతున్నాము.

సర్వాంతర్యామి అయిన బాబుకు తెలియనిదేమున్నది? క్రింద నుండి బాబు "నాకు యింకా ఆకలి తీరటం లేదు. ఇంకా ఎవరో భోజనం చేయకుండా మిగిలిపోయి వుంటారు. వారిని కూడా తీసుకురండి" అని పిల్లలను పంపించారు. వాళ్ళు వచ్చి 'బాబు మిమ్మల్నిద్దరిని భోజనానికి రమ్మనమంటున్నారు' అన్నారు. శ్రీగురుదేవుల ఆజ్ఞ పాలించి మేము క్రిందకు వెళ్ళాము.

శ్రీబాబు నాతోనే వున్న ఆమెను "ఏమమ్మా! భోజనానికి రాలేదు?' అని అడిగారు. ఆ భక్తురాలు వెంటనే 'బాబూ! నేను కొన్నాళ్ళ నుండి రాత్రి పూట భోజనం చేయటం లేదు. అందుకనే రాలేదు' అని చెప్పింది. అప్పుడు బాబు నావైపు చూస్తూ "ఏం సుశీలా! నీవెందుకు రాలేదు?' అని అడిగారు. నేను 'బాబూ! నాకు మోషన్స్ అవుతున్నాయి, కడుపులో నొప్పిగా వున్నది. తినకూడదని రాలేదు' అన్నాను.

శ్రీబాబు "అదిగో! ఆ అరటికాయ కూర వేసుకుని కడుపు నిండా తిను. శుభ్రంగా నీకు మోషన్స్ తగ్గిపోతాయి" అన్నారు. ఆ భక్తురాలను కూడా "మీరు కూడా శుభ్రంగా భోజనం చేయండమ్మా! ఏమీ కాదు" అన్నారు. ఇద్దరమూ కూడా బాబు సన్నిధిలో భోజనానికి కూర్చుని ఎంతో ఆనందంగా ఆ మహాప్రసాదన్ని తిని, ఆనందాన్ని అనుభవించి, పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందాము. సర్వాంతర్యామి, సర్వజ్ఞులు, సర్వశక్తిమంతులు కదా మన బాబు!

-గత సంచిక తరువాయి



విష్ణు కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

"మహాత్మా! చీకటి దారిలో పయనించి బ్రతుకును నిరర్థకం చేసుకున్నాను. మీరు నాకు ఉపదేశం చేసి నన్ను ఆశీర్వదించండి" అని పశ్చాత్తాప హృదయంతో కబీర్‌దాస్ పాదాలపై పడ్డాడు. కబీర్‌దాస్ తన సందేశాన్ని ఒక కీర్తన ద్వారా తెలియచేశాడు.



నిరధన్ కే ధన్ రామ్ రే
చోర్ న లేవై ఘటహు న జావై కష్టమె ఆవై కామ్
దిన్ దిన్ హొూత సవాయీా దౌలత్ బాఢత్ నహి దామ్ ।నిర।
జాగత్ సోవత్ ఊరత్ బైఠత జపో నిరంతర నామ్
అంత కాలమే ఛోడ్ చలత్ సబ పావస్ఏక్ ఛ దామ్
కహత్ కబీరా యే ధన్ కే ఆగే పారస్ కో క్యా నామ్ ।నిర। - "ధన హీనులకు రామ నామమే ధనం. రామనామ సంపద పెరుగుతుందే కాని తరగదు. మేల్కొన్నా నిదురిస్తున్నా నామం నిరంతరం చెయ్యి. మృత్యువు నిన్ను సమీపించే సమయంలో నిన్ను విడిచి వెళ్ళేవారే కాని నీ వెంట ఎవ్వరూ రారు. రామనామం ఎదుట పరుసవేది కూడా నిరుపయోగమే" అని షావుకారుకు బోధ చేశాడు. కబీర్ తోటివారందరినీ సన్మార్గంలో నడిపించేవాడు.సంపూర్ణశరణాగత మార్గంలో జీవితం గడిపేవాడు.

ఒకనాడు జ్ఞానదేవ, నామదేవులు భక్తులతో తీర్థయాత్రలు చేస్తూ కాశీనగరానికి వచ్చి కబీర్‌దాస్ గృహానికి అతిధులుగా వచ్చారు. వారికి వసతి సదుపాయాలన్నీ చేశాడు. కబీర్‌దాస్ భార్య లోయీా వారికి ఆతిధ్యమివ్వటానికి ఇంట్లో సరుకులు ఏవీ లేవని చెప్పింది. అప్పుడు అర్థరాత్రి అయింది. కొట్లోనుంచి సరుకులు దొంగిలిస్తే ఎలా ఉంటుంది? అని ఆలోచించాడు. దొంగతనం పాపం అని తెలుసు. కాని దొంగతనం అనే చిన్న తప్ప చేసి పవిత్రాత్మలకు ఆతిధ్యమివ్వట మనే బృహత్కార్యాన్ని నిర్వహించవచ్చు అని అనుకొన్నాడు. తన కుమారుడైన కమాల్‌ను తీసుకొని కన్నం వేయటానికి అవసరమైన గునపము, కత్తి తీసుకొని

బయలుదేరి తండ్రీ కుమారులు ఒక కొట్టు వద్దకు చేరారు. ఇంటికి కన్నం వేశారు. కమాల్‌ను పిలిచి, "నాయనా! నీవు లోపలకి వెళ్ళి సంత్ పురుషులకు ఆతిధ్యం ఇవ్వటానికి కావలసిన పదార్థాలు మాత్రమే తీసుకొని రా" అన్నాడు.

కమాల్ లోపలికి వెళ్ళి అవసరమైన పదార్థాలన్నీ మూట కట్టాడు. కన్నం ద్వారా తండ్రికి అందించాడు. కన్నం ద్వారా బయటకు రాబోతుండగా అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఇక్కడ ధనమూ, బంగారు ఆభరణాలున్నాయి. తాను వెళ్ళిన తరువాత ఈ కన్నం ద్వారా వేరే దొంగ ప్రవేశించి వాటిని అపహరిస్తాడేమో అని సందేహం కలిగింది. కమాల్ కొట్టు యాజమానిని నిద్రలేపి "ఏమండీ, మేము దొంగలం కాము. ఒక అవసర కార్య నిమిత్తం కావలసిన ఆహార పదార్థాలు తీసుకు వెళ్తున్నాము. మేము వేసిన కన్నం అలాగే ఉంది. మీరు జాగరూకులై ఉండండి" అని చెప్పి త్వరగా కన్నం ద్వారా బయటకు రావటానికి ప్రాకుతున్నాడు. వ్యాపారి పరిగెత్తుకుంటూ వచ్చి, అతని రెండు కాళ్ళు గట్టిగా పట్టేశాడు. "దొంగ! దొంగ!" అని కేకలు వేస్తున్నాడు.

పరిస్థితి తారుమారు అయిందని గ్రహించి "నాన్నా! ఇక లాభం లేదు. ఇతడు నా కాళ్ళను గట్టిగా పట్టుకున్నాడు. ఇక కొద్ది సేపట్లో జనం ప్రోగవుతారు. మన దొంగతనం బయటపడుతుంది. ఈ దొంగతనం మనం చేశామని తెలిస్తే జ్ఞానదేవ, నామదేవాదులు ఒక్క క్షణమైన మన ఇంట్లో ఉండరు. మన ఆతిధ్యం స్వీకరించరు. నేను నా జీవితాన్ని త్యాగం చేసే పవిత్ర సమయం ఆసన్నమైంది. నువ్వు నా తలను కోసి ఆ సరుకులను, నా శిరస్సును తీసుకొని వెళ్ళు" అని కమాల్ చెప్పగానే కుమారుని ఔదార్యానికి, త్యాగశీలతకు సంతసించి తన దగ్గర ఉన్న కత్తితో కమాల్ శిరస్సును నరికి సరుకులను, శిరస్సును తీసుకువెళ్ళాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL